ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 సంచిక : 06 ఫిబ్రవరి 2011

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

అరుణాచలం... 21-11-2010
జిన్నూరు ......... 23-12-2010
జిన్నూరు ......... 11-12-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## నా రమణ ప్రస్థానం

**(జనవరి 2011 శ్రీరమణజ్యోతిలో డాక్టర్ మిథిన్, హైద్రాబాద్ వారి ఆంగ్ల వ్యాసమునకు తెలుగు అనువాదం)**

నేను మంగుళూరులో కాలేజీలో చదువుకొనే రోజులలో, శ్రీరామ కృష్ణపరమహంసగారి భక్తునిగా శ్రీరామకృష్ణ మఠమును తరచుగా సందర్శించుట జరిగేది. 1995-96 సంవత్సరములో శ్రీరామకృష్ణులు కౌపీన ధారియై సోఫాలో కూర్చున్న విధముగా దర్శనమిచ్చారు. 'స్వామీ' ఎందుకు కేవలము కౌపీనము మాత్రమే ధరించియున్నారు? అని నేను ప్రశ్నించగా చిరునవ్వే వారి సమాధానం.

అది 2000 సంవత్సరము. బెంగుళూరు శ్రీరమణకేంద్ర వ్యవస్థాపకులు శ్రీ నటరాజన్ గారు రచించిన 'కాలంలో కాలాతీతుడు' అనే పుస్తకం ద్వారా భగవాన్ శ్రీ రమణ మహర్షికి పరిచయం కాబడ్డాను. ఆవిధంగా భగవాన్ శ్రీరమణుల తత్త్వబోధకు ఎంతగానో ఆకర్షింపబడిన నేను తదుపరి అన్వేషణలో గతంలో కౌపీనధారియై శ్రీరామకృష్ణులు దర్శనం ఇచ్చిన మాదిరిగానే భగవాన్ శ్రీ రమణమహర్షి ఫొటో కనుగొనుట జరిగింది. కాలం గడిచేకొలది అరుణాచలం పట్ల నా భక్తిభావం పెరుగుతూ ఉంది, కాని ప్రత్యక్షంగా వెళ్ళి అరుణాచలం దర్శించే అవకాశం రాలేదు.

అది 2008 సంవత్సరము ఇంటర్‌నెట్‌లో శ్రీరామకృష్ణుల వివరములు సేకరిస్తుండగా, భగవాన్ శ్రీరమణులు ప్రియశిష్యులైన సద్గురు శ్రీ నాన్నగారి గురించి తెలియవచ్చింది. ఎప్పటికైనా

శ్రీనాన్నగారిని దర్శించగలనా? అనే తపన, కోరిక కలిగినవి. తదుపరి శ్రీనాన్నగారు హైదరాబాద్‌లోని శ్రీసత్యసాయి నిగమ్‌లో అనుగ్రహభాషణం చేయుటకు వస్తున్నారని విని నేను కూడా అక్కడకు వెళ్ళి వారి ప్రవచనం వినాలని నిశ్చయించుకొన్నాను. ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ సత్యసాయి నిగమ్ చేరుకొని, చివరి వరుసలోని సీటులో కూర్చొన్నాను. అప్పటికి భక్తులందరి మధ్య రసవత్తరమైన సంభాషణ నడుస్తోంది. సద్గురు రాకతో అక్కడ నిశ్శబ్దత నెలకొంది.

అనుచర భక్తులతో సభాస్థలి వద్దకు శ్రీనాన్నగారు వచ్చి ప్రవచనం మొదలుపెట్టారు. వారు ప్రవచించిన అద్వైతబోధను అంతకు పూర్వము నేను వినియుండలేదు. కేవల పుస్తక జ్ఞానంకాక, సత్యానుభవం నుండి వారి బోధ జాలువారినదని నిశ్చయమైనది. నేను ఒక సద్గురువు సమక్షంలో ఉన్నానని అప్పడే అనుకొన్నాను. సూర్యాస్థమయం కావస్తోంది, ప్రవచనము ముగింపుకు వస్తోంది, అప్పడు శ్రీనాన్నగారు కూర్చొన్న వెనుక భాగం పై అంతస్థ కిటికీ ద్వారా సూర్యకిరణములను ఏకాగ్రంగా దర్శించుట జరిగింది. ఆ క్షణంలో నేను అలౌకిక శాంతికి గురియైనాను, తరువాత నిశ్శబ్దత అలముకుంది. ప్రవచనం పూర్తి అయిన తరువాత శ్రీనాన్నగారు అక్కడ గుమికూడిన భక్తజన సమూహమును తన కరుణాపూరితమైన, మృదువైన చూపుద్వారా అనుగ్రహిస్తున్నారు. మొత్తం ఆ ప్రాంగణంలో నిశ్శబ్దత నెలకొంది. ఆ మౌనం వారి మాటల కన్న ఎక్కువ శక్తివంతమైనది. అక్కడ ఉన్న భక్తుల ప్రతి ఒక్కరి రెండు నేత్రములు శ్రీ నాన్నగారినే కేంద్రీకరించి స్థిరంగా చూస్తున్నాయి. అప్పడు నా శ్వాస ఆగి ఒక మౌనశక్తి నన్ను ఆక్రమించినట్లు అనుభూతి చెందాను. శ్రీనాన్నగారు ఖచ్చితంగా మహాపురుషుడే అని నిశ్చయించుకొన్నాను.

పిమ్మట నా రాకను నాన్నగారు గుర్తించారా? లేదా? అన్న విషయాన్ని రూఢి చేసుకొనేందుకు మనోతరంగాలను పంపించాను. నాన్నగారి చుట్టూ అనేక మంది భక్తులు చేరి మాట్లాడుటకు, నమస్కరించుటకు, ఆశీస్సులు పొందుటకు ఎదురు చూస్తున్నారు. సభాస్థలికి ఎదురుగా నిలబడిన నేను నాన్నగారు పలుకరిస్తారేమోనని ఎదురు చూస్తున్నాను, కాని శ్రీ నాన్నగారు నావైపు చూడలేదు నా రాకను గమనించనూ లేదు. నేను మీ గురించి వచ్చాను అని మానసికంగా అనుకొన్నాను, కాని శ్రీ నాన్నగారు నన్ను తప్ప అందరిని చూసారు. అప్పడు నా అహంకారం కొద్దిగా దెబ్బతిని మా ఇద్దరి మధ్య జన్మాంతర అనుబంధం లేదేమో అనుకొని, ఇక ఆ ప్రదేశం విడిచిపెట్టి వెళ్ళుటకు సిద్ధపడ్డాను.

ఆ సభాప్రాగంణం నుండి బయటకు వస్తుండగా ఒక ఆలోచన వచ్చింది, శ్రీ నాన్నగారు నిజంగా మహాపురుషుడే! నా అహంకారాన్ని, అసహనాన్ని ప్రక్కనపెట్టి మరొకసారి ప్రయత్నిద్దామనుకున్నాను. నూతనోత్సాహంతో మరల లోపలికి ప్రవేశించి శ్రీనాన్నగారు ఉన్న చోటుకి చేరుకున్నాను. అప్పటికీ అక్కడ అనేకమంది భక్తులు గుమికూడి ఉన్నప్పటికీ ఆయన అనుగ్రహం వల్ల అక్కడ కొంత ఖాళీ ఏర్పడి, సద్గురువు శ్రీనాన్నగారు చిరునవ్వు మోముతో నన్ను చూచుట జరిగినది. ఆయన నన్ను సమీపించి నాకుడి బుగ్గను తన చేతితో తాకినారు, ఆశ్చర్యంతో నేను ఆయనకు వంగి నమస్కరించాను. కుడిబుగ్గమీద ఆయన తాకిన స్పర్శ ఆ రోజంతా దివ్యానుభూతిలో ఓలలాడించింది.

శ్రీ నాన్నగారి అనుగ్రహ ప్రభావమో లేదా పురాకృత పుణ్య ఫలితమో, నెల తిరగకుండా పవిత్ర అరుణాచల క్షేత్రంలో కాలు పెట్టుట జరిగింది. ఆ రోజు ఉదయం గిరి ప్రదక్షిణ చేస్తుండగా, అరుణగిరి శిఖరం మేఘావృతమై మబ్బుతో కప్పబడి ఉంది. నేను గిరికి హృదయ పూర్వకంగా నమస్కరించాను. అప్పుడు ఆ మేఘములు తొలగి ఆడిఅన్నామలై వద్ద నుండి అరుణగిరి ఆకృతిని, శిఖరాన్ని స్పష్టముగా దర్శించి ముగ్ధుడనయ్యాను. గిరి ప్రదక్షిణ ముగించుకొని, శ్రీరమణాశ్రమము చేరి, భగవాన్ సమాధికి ప్రదక్షిణ చేసి, తరువాత తిరిగి హైదరాబాదు చేరుకున్నాను.

పదిహేను సంవత్సరాల క్రితము కౌపీన ధారియైన శ్రీరామకృష్ణ పరమహంస పసిపిల్లవాని మాదిరి బోసినవ్వులతో దర్శనం ఇచ్చారు. తదుపరి కాలంలో అలాంటి నవ్వు, నేను ఇక ఎవ్వరిలోనూ చూచియుండలేదు. కానీ సద్గురు శ్రీ నాన్నగారితో పరిచయం అయ్యాక అదే చిరునవ్వు శ్రీ నాన్నగారిలో దర్శించాను. శ్రీ రామకృష్ణ పరమహంస గారు కౌపీన ధారియై ఇచ్చిన దర్శనమును భగవాన్ శ్రీ రమణ మహర్షిలోనూ, అదేవిధంగా శ్రీ రామకృష్ణుల బోసినవ్వును సద్గురు శ్రీ నాన్నగారిలోనూ దర్శించి ఆశ్చర్యచకితుడనయ్యాను. శ్రీ రామకృష్ణ పరమహంస గారిద్వారా భగవాన్ శ్రీ రమణ మహర్షి, అట్లే భగవాన్ శ్రీ రమణ మహర్షి ద్వారా సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహములోను పడుట ఎన్నో జన్మల పుణ్యఫలితముగా నేను భావిస్తున్నాను.

**అనువాదం : చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-11-2010, అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు అరుణాచల దీపోత్సవం. మీరు ఈ దీపాన్ని దర్శించి ఇంటికి వెళ్ళి ఆ దీపాన్ని జ్ఞాపకం తెచ్చుకొంటూ ఉంటే వారికి ఏకాగ్రత కలుగుతుంది, ధ్యానస్థితి కలుగుతుంది అని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవం నిన్నటి, మొన్నటి ఉత్సవం కాదు. ఈ కొండ మీద దీపం వెలిగించటం అనేది కొన్ని వేల సంవత్సరాల నుండి జరుగుతోంది. చాలా పురాణాలలో ఈ కొండ యొక్క వైభవం గురించి వ్రాయటం జరిగింది. ఇక్కడ అరుణాచలేశ్వరుడు గిరి రూపం, లింగరూపం, సిద్ధరూపం ఇలా మూడు రూపాలలో ఉన్నాడని చెపుతారు. ఈ రోజున ఈశ్వరుడు జ్యోతి స్థంభం రూపంలో మహావిష్ణువుకు, బ్రహ్మదేవుడికి దర్శనం ఇచ్చాడు కాబట్టి ఆ గుర్తుగా ఈ రోజున ఇక్కడ జ్యోతి ప్రజ్వలన చేస్తారు.

కాశీలో గంగానదిలో స్నానం చేయటం, విశ్వేశ్వరుని దర్శనం చేయటం ఎంత ప్రాముఖ్యమో ఇక్కడ గిరిని దర్శించటం, గిరి ప్రదక్షిణ చేయటం అంత ముఖ్యం. ఇక్కడ గిరికే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. ఇక్కడ చాలా మంది భక్తిగా గిరి ప్రదక్షిణ చేస్తారు. గిరి ప్రదక్షిణ చేసేటప్పుడు కాళ్ళకు జోడు ఉండకూడదు, నెత్తిమీద గొడుగు ఉండకూడదు, అది సాంప్రదాయం. గిరి ప్రదక్షిణ చేసేటప్పుడు రోడ్డుకు ఎడమ ప్రక్కనుండి వెళ్ళమని పెద్దలు చెపుతారు ఎందుచేతనంటే దేవతలు కుడి ప్రక్కనుండి ప్రదక్షిణ చేస్తారు. అందుచేత దేవతలకు అడ్డు రాకుండా మనం ఎడమ ప్రక్కనుండి వెళ్ళటం మంచిది. ప్రదక్షిణ చేసే వారు మౌనంగా చేయటం మంచిది. విషయచింతన చేయకుండా ఈశ్వరుడిని చింతిస్తూ మీరు నెమ్మదిగా నడవాలి. మీరు నెమ్మదిగా ఎలా నడవమని పురాణాలలో ఉందంటే రేపు పురుడు వచ్చే అమ్మాయి ఎంత నెమ్మదిగా నడుస్తుందో అంత నెమ్మదిగా నడవడం మంచిది అని చెప్పారు. మీరు మౌనంగా గిరిని ధ్యానం చేసుకొంటూ ప్రదక్షిణ చేయటం మంచిది. కొంతమంది కోరికలతో గిరిప్రదక్షిణ చేస్తారు. దానికేమి పొరపాటు లేదు ఎందుచేతనంటే జీవలక్షణాలు ఉన్నంతసేపు కోరికలుంటాయి కదా. ఇక్కడ గిరి ప్రదక్షిణలకు చాలా ప్రాముఖ్యత ఉంది. 1927వ సంవత్సరం వరకు భగవాన్‌కూడా ప్రదక్షిణ చేసేవారు. ఈ ప్రపంచంలో భగవాన్‌కు ఏదైనా ఆకర్షణ అంటూ ఉంటే, అది ఈ డివైన్ మౌంటైన్. మన మనస్సుకు అర్ధంకాని అతీతమైన శక్తి ఈ మౌంటైన్‌లో ఉంది, కైలాసంలో శివుడు ఉన్నాడు అని పురాణాలలో చెపుతారు. భగవాన్ ఏమన్నారు అంటే ఈగిరే శివుడు అన్నారు. మీలో చాలామంది గిరి ప్రదక్షిణ చేసేవారున్నారు. మేము అరుణాచలం వచ్చిన కొత్తలో చేసేవారము, ఇప్పుడు ఓపిక లేక చెయ్యటంలేదు.

మనలో ఏవో పాపాలు, దోషాలు, బలహీనతలు లేకపోతే మనకు ఈశరీరం రాదు. నూటికి నూరుపాళ్ళు ఆనందస్థితిని పొందినవాడికి పునర్జన్మరాదు. అందుచేత మనం సాధన చేసి మనలో ఉన్న దోషాలను, బలహీనతలను పోగొట్టుకోవాలి. జ్ఞానం సంపాదించటం అంటే మీలో ఉన్న అజ్ఞానాన్ని పోగొట్టుకోవటమే అన్నారు భగవాన్. ఇక్కడ కొండకు జ్ఞానగిరి అని పేరు, దీనిని శాంతిమలై అంటారు. అంటే జ్ఞానాన్ని ప్రసాదించే కొండ, శాంతిని ఇచ్చే కొండ. ఈకొండ సైలెంట్‌గా పనిచేస్తుంది అంటే అరుణాచలేశ్వరుడి వలన మనకీ సహాయం జరిగింది అని మనకు తెలియదు, అది మన బ్రెయిన్‌కు అందదు. నేను ఎవడను అనే విచారణ ద్వారా అహంకారాన్ని పోగొట్టుకోమని చెపుతున్నారు. కాని అరుణాచలేశ్వరుడి దయ లేకుండా కేవలం మనం ప్రయత్నం చేసి అహంకార రహిత స్థితిని పొందలేము, కోటి జన్మలు ఎత్తినా పొందలేము. అహంభావన పోవాలంటే డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ రావాలి. రమణమహర్షిగారికి ఈ కొండకి ఏమీ తేడాలేదు. ఈ కొండే తిరుచ్చుళిలో ఒక రూపం ధరించి అరుణాచలం వచ్చింది అంటే అరుణాచలేశ్వరుడే అరుణాచలం చేరుకొన్నాడు. భగవాన్ ఏమని చెప్పారు అంటే పులి నోటిలో పడ్డ మాంసపు ముక్కను ఏ విధంగా అయితే బయటకు తీయలేమో అలాగే ఒక్కసారి అరుణాచలేశ్వరుని అనుగ్రహంలో పడితే అందులో నుండి మీరు బయట పడే అవకాశం లేదు, అంటే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అసలు మనకు అహంకారం లేదు అని అనుకోవద్దు. మనకు మాట ఎందుకు వస్తోంది చెప్పండి. రోజుకు అవసరం ఉండి మనం ఎన్ని మాటలు మాట్లాడుతున్నాము, అహంకారం కోసం గొప్పలకోసం ఎన్ని మాటలు మాట్లాడుతున్నాము అని మీరు చూసుకొంటే అవసరం ఉండి నాలుగు మాటలు మాట్లాడితే అహంకారం కోసం 96 మాటలు మాట్లాడుతున్నాము. మీ శరీరమే అహంకారం. అహంకారం లేకపోతే మీకు శరీరం ఎందుకు వస్తుంది. రమణమహర్షి రామకృష్ణపరమహంస వాళ్ళు వేరు, వారు కారణజన్ములు. వారికి అనుభవించవలసిన కర్మ అంటూ ఏమీ లేదు. మనం కర్మ అనుభవించటానికి వచ్చాము. మన స్టోర్‌లో పుణ్యకర్మో, పాపకర్మో ఏదీ లేకపోతే అసలు నీకు శరీరం రావలసిన పని ఏమిటి?

ప్రదక్షిణం. **"ప్ర"** అంటే పాపాలను పోగొడుతుంది అంటే పూర్వజన్మల నుండి మీరు మోసుకొని వస్తున్న పాపాలను పోగొడుతుంది. ఒకేసారి పాపాలు అన్నీ పోతాయి అని అనుకోవద్దు. ప్రదక్షిణం ప్రారంభిస్తే మీ పాపాలకు అరుణాచలేశ్వరుడు నిప్పు పెడతాడు, అవి కాలి బూడిద అవ్వటానికి కొంత టైము పడుతుంది. **"ద"** అంటే మీరు అడిగినవి అన్నీ ఇస్తూ ఉంటాడు. కొంతమంది దేవతలు అడిగించుకొని ఇస్తారు కాని అరుణాచలేశ్వరుడు ఎవరిచేత అడిగించుకోకుండా వారి అవసరాలు ఏమిటో చూసుకొని ఇస్తాడు. నీ అవసరాలు ఏమిటి నీకంటే ఆయనకు బాగా తెలుసు. మంచికాని దానిని నువ్వు మంచి అనుకొని కోరుకొన్నా

అది నీకు ఇవ్వడు ఎందుచేతనంటే నువ్వు బాగుపడటం ఆయనకు ముఖ్యం. ఒకవేళ నువ్వు కోరుకున్నది ఇస్తే నువ్వు పాడైపోతావు అని ఆయన అనుకొన్నప్పడు అది ఇవ్వడు. అవసరాన్ని బట్టి అది ఎప్పడు ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వాలో ఆయన నిర్ణయించు కొంటాడు. అరుణాచలేశ్వరుడు నేను అడిగింది ఇవ్వటం లేదు అని నువ్వు ఆయనను యాగీ చేసినా అది అనుభవిస్తాడుగాని నిన్ను పాడుచెయ్యడు. **"క్షి"** అంటే క్షీణింపచేయటం. పుష్పంలోనుండి వాసనను గాలి ఏవిధంగా అయితే మోసుకొని వస్తుందో అలాగ నీ శరీరం చనిపోయిన తరువాత ఇక్కడ ఉన్న పుణ్యపాపములను ఈ జీవుడు కొత్త శరీరంలోనికి మోసుకొని వస్తాడు. మనం అహంకారాన్ని పోగొట్టుకోలేము. పోగొట్టుకొన్నట్లు నటించమంటే నటిస్తారు గాని నిజంగా పోగొట్టుకోరు. అదే మీరు అనుకొన్నప్పడు దానిని ఎలా పోగొట్టుకొంటారు. నీకు తెలియకుండా నీలో చాలా దోషాలు ఉంటాయి. నువ్వు ఏమి చేస్తావు అంటే ఆ దోషాలు ఇతరులకు కనబడకుండా స్నో రాసేసుకొని, పౌడర్ రాసేసుకొని ముస్తాబు అయి వస్తావు లోపల చూస్తే కంపు, కంపు. నువ్వు ఎన్ని పౌడర్ డబ్బాలు, స్నో సీసాలు అవ్వగొట్టినా, ఎంత వైట్‌వాష్ చేసినా మనలో ఉన్న బలహీనతలు ఏమిటో అంతర్యామి చూస్తూ ఉంటాడు, వాటిని క్షీణింపచేయటం మొదలుపెడతాడు అంటే వాటిని తగ్గించటానికి ప్రయత్నం చేస్తాడు. నీలో ఉన్న బలహీనతలను బయటకు లాగి కాల్చి బూడిద చేయకుండా నీకు ఆత్మజ్ఞానం ఆయన కూడా ఇవ్వలేడు. ఇవన్నీ అయిన తరువాత **"ణ"** అంటే నీలో ఉన్న బలహీనతలను నాశనం చేసి అప్పడు నీకు మోక్షం ఇస్తాడు.

పూర్వం పెద్దలు, మహాత్ములు అందరూ ఇక్కడ ప్రదక్షిణ చేసినవారే. రమణమహర్షి గారు కూడా ప్రదక్షిణ చేసేవారు. ఆయనే అరుణాచలేశ్వరుడు అయినప్పడు ఆయనకు ప్రదక్షిణ ఎందుకు అంటే మనకు అలవాటు చేయటానికే ఇది అంతా. కృష్ణుడు చాలా కష్టపడి పనిచేసాడు. భగవంతుడే పనిచేయటం లేదు అని అందరూ బద్ధకస్తులకింద తయారవుతారని ఈ జీవకోటికోసం నేను పనిచేస్తున్నాను కాని పనిచేసి పొందవలసింది అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు అని పరమాత్మ చెప్పాడు. వాడికి పొందవలసింది అంటూ ఏదైనా ఉంటే వాడు వెలితిలో ఉన్నాడని అర్ధం. వెలితిలో ఉన్నవాడు దేవుడు ఎలా అవుతాడు. నువ్వు చేసిన తప్పలు రెండు ఓడలకు సరిపడ లగేజి ఉంది అనుకో. నువ్వు ఆత్మజ్ఞానాన్ని సంపాదిస్తే, నువ్వు చేసిన మొత్తం తప్పలను జ్ఞానం కాల్చి బూడిద చేస్తుంది. ఇది భగవాన్ ఉవాచ. ఇక్కడ జ్యోతిని మహాదీపం అంటారు. ఈ దీపాన్ని దర్శించినవారికి పుణ్యం వస్తుంది అని చెపుతారు. ఒకసారి మీరు దర్శనం చేస్తే దాని ప్రభావం మీ జీవితంలో ఎప్పడోకప్పడు కనిపిస్తుంది. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నువ్వు మంచి చేసి ఉంటే, ఆ చేసిన మంచిని నువ్వు మరిచిపోయినా

అది నీకు ఏదో రకంగా ఉపకారం చేయకుండా నిన్ను విడిచిపెట్టదు. మంచి చేసిన వాడికి దుర్గతి లేదు. తాత్కాలికంగా ఒకవేళ దుర్గతిలో ఉన్నా ఏదో రోజున సద్గతినే పొందుతాడు.

మనం ఆత్మకు భిన్నంగా ఉన్నాముఅనుకొంటున్నాము, ఆత్మను తెలుసుకోవాలి అని అనుకొంటున్నాము. ఆత్మను సంపాదించటం అంటూ ఏమీలేదు, నువ్వు ఆత్మకు భిన్నంగా లేవు. గీతలో పరమాత్మ ఆత్మవైభవం గురించి చెప్పి చెప్పి అది ఎవరో కాదు నువ్వే అని చెప్పాడు. నువ్వు దేహాన్ని అనుకో, నువ్వు మనస్సుని అనుకో, నీ ఇష్టం వచ్చినట్లు అనుకో. నువ్వు ఏది అనుకొన్నా అది నువ్వు కాదు, నువ్వు ఆత్మ అయి ఉన్నావు. నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు తెలియటం లేదు. అది నీకు తెలిస్తే సుఖపడతావు, తెలియకపోతే ప్రతీ జన్మలోను దుఃఖం నిన్ను వెంటాడుతుంది. నేను ఎవడను అనే ప్రశ్న కూడా మనలను ఆత్మ దగ్గరకు దొర్లించటానికే. పురాణాల గొడవ లేదు, ఆత్మవిద్య తప్పించి, భగవాన్ ఇంకొకటి బోధించలేదు. నువ్వు తొంభై విద్యలు నేర్చుకో కాని ఆత్మవిద్య సముపార్జించకుండా సంసార సాగరంలో నుండి, జననమరణ చక్రంలో నుండి బయటకు వచ్చే అవకాశం లేదు. నీలో ఏమీ పాపంలేదు అనుకో, దోషం లేదు అనుకో నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు ఎందుకు వ్యక్తమవ్వటంలేదు. అసలు నీకు వేరు భావన ఎందుకు వస్తోంది. ఆత్మవేరు, నేను వేరు దానిని నేను తెలుసుకోవాలి అనుకొంటున్నావు కదా. అది వేరు, నేను వేరు అని అసలు వేరుభావన నీకు ఎందుకు వస్తోంది దానికి నీలో ఉన్న పాపం కారణం. మీరు నిజంగా నూటికి నూరుపాళ్ళు బుద్ధిమంతులు అనుకోదాని తాలుక ఎరుక మీకు రావాలి కదా. అది నీవు అన్న సంగతి నీకు తెలియటంలేదు. అది నీవే అన్న సంగతి నీకు తెలిసినప్పడు, దాని తాలుక ఎరుక నీకు వచ్చినప్పడు కొత్తగా ఏదో సంపాదించినట్లు నీ మనస్సుకు అలా అనిపిస్తుంది కాని అది నువ్వే. ఆత్మజ్ఞానం గురించి భగవాన్ అంత వివరంగా ఎందుకు చెప్పారు అంటే ఆత్మజ్ఞానం లేకపోతే నీకు సుఖం లేదు, శాంతి లేదు, ఆనందం లేదు.

నాకు ఆత్మజ్ఞానం సంపాదించాలని ఉంది అని ఒక శిష్యుడు గురువుగారిని అడిగాడు. ఆయన ఏమి చెప్పాడు అంటే నువ్వు ఏమి సాధన చేయవద్దురాబాబు రోజూ మరణాన్ని జ్ఞాపకం పెట్టుకో అన్నాడు. ఈ శరీరం ఏదోరోజు చనిపోతుంది అని ఒక్క పాయింటు నువ్వు నిరంతరం జ్ఞాపకం పెట్టుకో. అప్పడు నీ మనస్సు దాని పుట్టుస్థానం వైపుకు మరలుతుంది. అహంకారాన్ని పోగొట్టుకోవటానికి మీరు సాధన చేస్తూ ఉంటే అది వేషాలు మారుస్తూ ఉంటుంది. అహంకారం అంటే ఇలా ఉంటుంది కదా అని తెలుసుకొని దానిని పట్టుకొనే టైముకు అది వేషం మార్చి ఇంకో వేషంలోనికి వెళ్ళిపోతుంది. ఇంక మీరు దానిని ఎలా పట్టుకోగలరు. అంటే అరుణాచలేశ్వరుడి అనుగ్రహం లేకుండా అహంకారం యొక్క మూలం మీకు తెలియదు; దాని మూలం తెలియకుండా అది నశించదు. సాధన చేసినా మీకు తెలియదు అలాగని

మిమ్మల్ని సాధన చెయ్యవద్దు అనటం లేదు. ఏదో నటించండి. మీరు ప్రయత్నము చేయండి. వీరు చాలా తిప్పలు పడుతున్నారు పాపం, వీరిపట్ల దయ చూపిందాము అని ఆయనకు మీ పట్ల దయ కలుగుతుంది, మీరు చేసే ప్రయత్నానికి కూడా కొన్ని మార్కులు వేస్తాడు. ఇది మీరు జ్ఞాపకం పెట్టుకోండి. మనందరికి చావు అంటే భయం ఎందుకు అంటే ఈ శరీరం లేకుండా మనం ఉండలేము అని గట్టిగా నమ్ముతున్నాము. అది నిజంకాదు. అదొక నమ్మకం. ఆ నమ్మకమే మనలను పాడుచేస్తుంది. శరీరం లేకుండా మనం ఉండలేము అన్న భావన మనలో ఎంత గట్టిగా ఉందో అంత గట్టిగా శరీరం లేకుండా మనం ఉండగలము. అది నిజం కాని ఆ నిజాన్ని మన బుద్ధి నమ్మలేకపోతోంది. ఈ శరీరం లోపల నేను ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో వైకుంఠంలో దేవుడు ఉన్నాడు అని ఇవన్నీ కల్పించేది నీ అహంకారమే. దేహం ఉన్నా లేకపోయినా, ఈ ప్రపంచం కనిపించినా కనిపించకపోయినా, దేవుడు ఉన్నా లేకపోయినా మీ అస్థిత్వానికి భంగం లేదు, దాని మీద మనకు విశ్వాసం కలగాలి. మీరు విశ్వాస హీనులు అవ్వవద్దు. దేవుని వాక్యాన్ని నమ్మండి. నిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి ఎలా మేల్కొంటామో అలాగ దేవుని వాక్యంలోనికి మనం మేల్కోలేకపోతున్నాము. అక్కడికి మెలకువ వచ్చేవరకు మనకు జన్మలు తప్పవు, ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే.

మనిషికి ఎక్కువ దుఃఖం తీసుకొని వచ్చేది భయం. నీ కంటే భిన్నంగా ఏది కనిపించినా నీకు భయం కలుగుతుంది. ద్వైతంలో నుండి భయం వస్తుంది, ద్వైతంలో నుండి ద్వేషం వస్తుంది, ఈ పెంట అంతా ద్వైతంలో నుండే వస్తుంది. భయం ప్రతీ మనిషిని పీడిస్తోంది. నిద్రలో నీకు భయం ఉందా? నిద్రలో నీ మీద నుండి పాము పాకి వెళ్ళినా నీకు భయం లేదు. ఎందుచేతనంటే అక్కడ నీకు తలంపులు లేవు, దేహభావన లేదు, అక్కడ నీకు భయం కూడా లేదు. అంటే భయం కూడా నిజంకాదు, అది కూడా ఒక తలంపు. నీకు ఏకారణం వలన భయం వచ్చినా వెంటనే దుఃఖం వచ్చేస్తుంది. మనిషి కూడా నీడ ఎలా వస్తుందో భయం కూడా దుఃఖం వచ్చేస్తుంది. అందుచేత నిన్ను భయం విడిచిపెట్టమని చెపుతున్నాడు. ఇంకో మనిషిని కాని, వస్తువునుగాని మన కంటే భిన్నంగా చూస్తున్నాము. నేను మిమ్మల్ని నాకంటే భిన్నంగా చూస్తున్నాను. మీరు నన్ను మీకంటే భిన్నంగా చూస్తున్నారు. అలా చూసేది అహంభావన. మీలో ఉన్న ఆత్మ మీకంటే భిన్నంగా నన్ను చూడటంలేదు. నాలో ఉన్న ఆత్మ నాకంటే భిన్నంగా మిమ్మల్ని చూడటంలేదు ఎందుచేతనంటే అక్కడ ఉన్నది ఇక్కడ ఉన్నది ఒక్కటే. తనను తాను భిన్నంగా చూసుకోడుకదా. దాని తాలుక అనుభవం నీకు వచ్చేవరకు అన్నీ భిన్నంగానే చూస్తావు. నేను దేహాన్ని అనుకొన్నప్పుడు వేదాంత పుస్తకాలు ఎన్ని చదివినా నువ్వు దేహంగానే కనిపిస్తావు. నాకు ఆత్మానుభవం కలిగినప్పుడు నువ్వు ఆత్మగా కనిపిస్తావు. నేను పులిని చూస్తాను అనుకోండి,

ఆ పులి నాకు ఎలా కనిపిస్తుంది పులిలాగే కనిపిస్తుంది. అక్కడ రూపం తేడా, గుణాలు తేడా కాని నాలో ఏది ఉందో, పులిలో కూడా అదే ఉంది. అది యదార్థం. నాలో ఉన్నది అక్కడ కనిపిస్తోంది అనుకోండి ఇంక భయం ఏమిటి? కాని నన్ను నేను శరీరంగా చూస్తున్నప్పుడు పులి కూడా శరీరంలాగే కనిపిస్తుంది, అప్పుడు వెంటనే భయం కలుగుతుంది, పరుగెత్తుకొని పోతాము. నీ అస్థిత్వం దేహానికే పరిమితమైనప్పుడు ఎదుటివాడు కూడా దేహం కిందే కనిపిస్తాడు. అప్పుడు భయం ప్రారంభమవుతుంది. మనస్సుకు అవుట్ టర్నేకాని దానికి హోమ్‌టర్న్ లేదు. మనస్సు ఎంతసేపు బయటకు చూడటానికే అలవాటు పడిపోయింది. మనస్సు బయటకు వచ్చి ఇంద్రియాలకు సంబంధించిన విషయాలలో విహరిస్తుంది. మనస్సు ముందుకు వెళ్ళమంటే ఎంతదూరమైనా దూసుకొనిపోతుంది కాని వెనక్కి ఒక్క అంగుళం జరగమంటే జరగదు. మనస్సుకు హోమ్‌టర్న్ రావాలంటే గురువు అనుగ్రహం ఉండాలి.

గాఢనిద్రలో మీకు తలంపులు లేవు. జాగ్రదవస్థలోనికి రాగానే మొదట నేను అనే తలంపు వచ్చి దేహంతో తాదాత్మ్యం పొందుతుంది. అదే మూలతలంపు అక్కడ నుండి పాపం ప్రారంభమవుతుంది. ఆ మూలతలంపు దేహంవైపుకు జరుగుతూ ఉంటుంది. ఆ మూలతలంపును ఇటువచ్చే బదులు అటు ఆత్మవైపుకు తోలుకొని వెళ్ళాలి. ఇప్పుడు మీకు దేహము నేను అనే భావన ఎలా ఉందో ఆత్మ నేను అనే భావన వచ్చేవరకు దానిని లోపలకు గెంటుకొని వెళ్ళాలి. ఇప్పుడు నేను అనేటప్పటికి దేహం నీకు స్ఫురిస్తోంది అలాగే నేను అనేటప్పటికి ఆత్మ నీకు స్ఫురించాలి. ఆ ప్రక్కకు దానిని తోలుకొని వెళ్ళాలి, అదే యోగం. నేను మొన్న హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఎవరిదగ్గరో వాడు గొప్ప ఆఫీసర్ అన్నాను. వాడు గొప్ప ఆఫీసర్ కాదండి, గొప్ప ఆఫీసర్ కింద కనబడేలాగ తొడుగువేసుకొన్నాడు, ఆ తొడుగును చూసి వాడు గ్రేట్‌మేన్ అని ప్రజలు అనుకొంటున్నారు. వాడు మాయావి ఆ తొడుగును మనకు కనబడనివ్వడు. మనం పెద్ద మనుషులు అనుకొనేవారందరూ నిజంగా పెద్ద మనుషులు కాదు. కొందరు పెద్ద మనుషులకింద తొడుగువేసుకొంటారు. అలా వేసుకొంటే వేసుకోవచ్చు, వారిని ప్రపంచం గుర్తించవచ్చు కాని వారిని, ఆ తొడుగులను ఈశ్వరుడు గుర్తించడు. ఈ పొరలన్నీ కోసి అవతల పడేస్తాడు. ఆత్మకు చావులేదు, నేను అనేటప్పటికి నీకు ఆత్మ స్ఫురిస్తోంది అనుకో అప్పుడు నీవు చావులేని స్థితిని పొందుతావు. ఇప్పడే మీరు ఆ స్థితిని పొందవచ్చు. దానికే ఈ ప్రవచనాలు, ఈ జ్ఞానయజ్ఞాలు. శరీరం ఉండగానే శరీరం లేని స్థితికి ఎదిగి వెళ్ళాలి. ఆ స్థితికి వెళ్ళటానికి ఈ శరీరాన్ని ఉపయోగించుకోవాలి. ముందు మీరు దేవుడిని ఎంజాయ్ చేయటం నేర్చుకోవాలి, ఆయనను ఎంజాయ్ చేస్తూ ఉంటే మరణం లేని స్థితికి ఆయనే మిమ్మల్ని తోలుకొనిపోతాడు. ఆ స్థితిని పొందినప్పడు నీ

శరీరం కూడా నీకు శవం కిందే కనిపిస్తుంది. దానినే జీవన్ముక్తస్థితి అంటారు. ఆ స్థితిని ఇప్పుడే ఇక్కడే ఈ శరీరం భూమి మీద తిరుగుతున్నప్పుడే మీరు పొందవచ్చు.

వర్తమానకాలంలో జీవించు. అంటే నీ శరీరం ఎక్కడ ఉందో నీ మనస్సు అక్కడ ఉండాలి. నీ శరీరాన్ని ఇక్కడ పెట్టి భూతకాలం గురించి, భవిష్యత్ కాలంగురించి ఆలోచిస్తూ ఉంటే వర్తమానకాలంలో జీవిస్తున్నట్లు ఎలా అవుతుంది. ఎక్కడైతే శరీరం ఉందో అక్కడే మనస్సును ఉంచటానికి అలవాటు చేసుకోండి. శరీరానికి భయం వేయటం లేదు. నీ లోపల ఉండి ఎవడైతే భయపడుతున్నాడో వాడు నిజం కాదు. వాడిని డౌట్ చేస్తూ ఉంటే, వాడు ఎవడు అని అన్వేషణ చేస్తూ ఉంటే వాడు పత్తా లేకుండా పోతాడు. మనం భగవంతుని ప్రార్థించగా ప్రార్థించగా ఆ భయపడే వాడే మనలో సైతానుగా ఉన్నాడు కదా నేను ఇలా ఉంటాను అని వాడు మనకు చెప్పేస్తాడు. అప్పుడు మనం వాడిని బయటకు తోలేయవచ్చు, అది ఈశ్వరుని దయ, దటీజ్ ద గ్రేస్ ఆఫ్ అరుణాచలా. గాంధీగారు చిన్నతనంలో ఇంట్లో గూటిలో ఉన్న డబ్బులు దొంగతనం చేసేవారు. గాంధీగారు బుద్ధిమంతుడు అని ఆయన తండ్రిగారికి గట్టి నమ్మకం. ఆయన గాంధీగారి తల్లిని తిట్టేవారట. నేను దొంగతనం చేస్తే తండ్రి ఇంట్లోవారిని తిడుతున్నారు అని ఒక రోజున నేనే దొంగతనం చేస్తున్నాను అని ఉత్తరం వ్రాసి తండ్రికి ఇచ్చాడు. తండ్రి అది చదువుకొని గాంధీగారిని తిట్టలేదు, కొట్టలేదు, కళ్ళమ్మట నీరు పెట్టుకొన్నాడు. ఆ నీరే నా పాపాన్ని, నా హేబిట్స్‌ను కడిగేసాయి అన్నారు గాంధీగారు. గాంధీగారిని ఆయన తండ్రి పట్టుకోలేదు, ఆయనే రివీల్ అయిపోయాడు. అలాగే మనలో ఉన్న దొంగను మనం పట్టుకోలేము. భగవంతుని ప్రార్థించగా, ప్రార్థించగా నేనే దొంగను అని వాడే రివీల్ అయిపోతాడు. ఇంత కాలానికి దొంగ దొరికాడు అని అప్పుడు మనకు ఆశ్చర్యం కలుగుతుంది. మీ లోపల ఉన్న దొంగ పోతే అంటే అహంభావన పోతే దానిని అంటిపెట్టుకొని ఉన్న గుణాలు అన్నీ పోతాయి, దుఃఖం కూడా పోతుంది. అది మీ కడసారి జన్మ. అది ఎప్పుడో కాదు ఈ జన్మలోనే సాధించాలి. ఇది బాహ్యంగా చూస్తే అసాధ్యమే కాని ఈశ్వరుని దయ ఉంటే అది సాధ్యం అవుతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-12-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు రమణజయంతి, మొట్టమొదటిగా 1912వ సంవత్సరంలో భగవాన్ విరూపాక్షగుహలో ఉండగా ఆయన పుట్టినరోజు చేయడం మొదలుపెట్టారు. ఆరోజున ఆయన జన్మదినోత్సవం చేస్తున్నారని ఆయనకు తెలియదు. కొంతమంది భక్తులు స్వీట్స్, పుష్పాలు తెచ్చుకొన్నారు. ఏమిటి ఈ గొడవ అంటే ఈ రోజు మీ పుట్టినరోజు అని చెప్పారు. ఇటువంటి

గొడవలు ఏమీ ఇక్కడ పెట్టకండి అని భగవాన్ చెప్పారు. పుట్టినరోజున మెడలో దండలు వేసుకోవటం, పాయసం తాగటం, సంతోషంగా గడపటం అది కాదు అసలు ఈ శరీరం నాకు ఎందుకు వచ్చింది, ఏ ప్రారబ్ధం అనుభవించటానికి ఈ దేహం వచ్చింది అని రోజూ మీరు విచారణ చేసుకోవాలి, అలా రోజూ విచారణ చేసే శక్తి మీకు లేకపోయినా కనీసం శరీరం పుట్టినరోజు అయినా విచారణ చేసుకోండి. ఈ శరీరం పుట్టకముందు మీరున్నారు, ఈ శరీరం చనిపోయిన తరువాత కూడా మీరుఉంటారు. ఈ శరీరం పుట్టటం, ఈ శరీరం చనిపోవటం రెండూ అబద్ధం. రమణమహర్షి పుట్టాడు అంటే ఈ శరీరం పుట్టకముందు వీడులేడా. వీడు ఎక్కడో ఉన్నాడు కాబట్టి వచ్చాడు. అందుచేత ఈ పుట్టినరోజు గొడవలు ఇక్కడ పెట్టకండి అని అంటే మేము ఇంటిదగ్గరనుండి ఏవో తెచ్చుకొన్నాము, ఇక్కడ తినేసి వెళ్లిపోతాము అంటే సరే తినమన్నారు. అలాగ ఆయనకు యిష్టంలేకుండానే పుట్టినరోజు చేయటం భక్తులు మొదలుపెట్టారు.

రమణజయంతి మీకు వెలుగు, నాకు వెలుగు, ఈ భూమికి వెలుగు. ఆత్మవిద్యను బోధించటానికి వచ్చిన అవతారం అది. మనం కర్మ అనుభవించటానికి ఈ భూమి మీదకు వచ్చాము. వారు కారణజన్ములు. ఏదో కారణం నిమిత్తం వస్తారు కాని, కర్మ అనుభవించటానికి కాదు, అనుభవించటానికి అంటూ అక్కడ ఏమీ ఉండదు. అసలు నేను ఉంటే కర్మ ఉంటుంది, నేను లేనివాడికి కర్మ ఏమిటి? నేను ఉంటే నువ్వు ఉన్నావు, వాడు ఉన్నాడు. అసలు నేను లేకపోతే నువ్వు ఎక్కడున్నావు, వాడు ఎక్కడ ఉన్నాడు, ఎవడూ లేడు, ఏమీ లేదు. మనకు ఎంతసేపు పూజలు, యజ్ఞాలు, యాగాలు ఈ గొడవ ఎక్కువ అయిపోయింది. మనస్సును ఎలా లోపలకు పంపాలి, దానిని హృదయంలో ఎలా లయం చేయాలి అనే టీచింగు తగ్గిపోయింది. కొంతమంది పండితులు ఏమనుకొంటున్నారు అంటే పాండిత్యమే ఆత్మజ్ఞానం అనుకొనే స్థాయికి పడిపోయారు. మరుగున పడిపోయిన ఆత్మవిద్యను మనకు బోధించటానికి రమణస్వామి ఈ భూమిమీదకు వచ్చారు. బాహ్యముఖంగా విజృంభిస్తున్న మన మనస్సును అంతర్ముఖం చేయటానికి, మనలను అనుగ్రహించి మనకు లోచూపు నేర్పటానికి ఆయన ఈ భూమిమీదకు వచ్చారు. గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు. లోపల అజ్ఞానం అనే చీకటి ఉంది, దానిని పోగొట్టేవాడు గురువు. భగవాన్ నేను ఎవడను అనే విచారణ గురించి ఎక్కువగా చెప్పారు. మీరు ఆయుర్వేదం వాడినా, ఇంగ్లీషు మందులు వాడినా, హోమియోపతి వాడినా నీరోగం తగ్గాలి. అది ముఖ్యం. అలాగే నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహబుద్ధి నశించాలి. ఎందుచేతనంటే ఈ దేహమే నేను అని నువ్వు అనుకొంటున్నావు, దేహమే సత్యం అనుకొంటున్నావు, దేహమే సర్వస్వం అనుకొంటున్నావు, ఆ బుద్ధిని పోగొట్టేవాడే గురువు.

దేహగతమైన నేనులోనుండి నిన్ను విడిపించటానికి వచ్చిన అవతారమే రమణావతారం.

మన బంధం లోపలే ఉంది కాని బయట లేదు. బంధం నేను రూపంలో ఉంది. మనం నేను, నేను అంటున్నాము కదా. ఆ నేనుగా ఎవరు వ్యక్తమవుతున్నారు. మనస్సే మనకు నేనుగా వ్యక్తమవుతోంది. అది నశించేవరకు మనకు శాంతిలేదు, సుఖంలేదు, జ్ఞానం లేదు. దానిని తొలగించటానికి సహకరించే వాడే గురువు. పరిమితులు లేకుండా ఈ సృష్టినంతా ప్రేమించిన మనిషి గౌతమబుద్ధుడు. బుద్ధుడి ప్రేమ మానవజాతికే కాదు జంతుజాలానికి కూడా విస్తరించింది. బుద్ధుడి టీచింగ్ అంతా చెట్టుకిందే. ఆయనను ఎవరైనా భోజనానికి పిలిచినా భోజనం చేసి వెళ్లిపోతాడు, చెట్టుకింద కూర్చుంటాడు. ఆయన చెట్టుకింద ప్రశాంతంగా కూర్చున్నాడు. ఒక భక్తుడు వచ్చి దేవుడు మీద నాకు నమ్మకంలేదు అన్నాడు, నువ్వు చెప్పింది నిజమే అన్నాడు బుద్ధుడు. నాలుగు రోజుల తరువాత ఇంకో భక్తుడు వచ్చి దేవుడున్నాడని నాకు నమ్మకంగా ఉంది అన్నాడు. నువ్వు చెప్పింది నిజమే అన్నాడు. కొన్నిరోజుల తరువాత ఇంకో భక్తుడు వచ్చి ఏమండి నేను ఈ గొడవ పడ లేకపోతున్నాను. కొంతమంది దేవుడున్నాడు అంటున్నారు, కొంతమంది దేవుడు లేడంటున్నారు. దేవుడు ఉన్నాడు అనుకోవాలా, లేడు అనుకోవాలా నాకు తెలియటంలేదు అని అడిగాడు. బుద్ధుడు ఏమన్నాడంటే దేవుడున్నాడా లేడా అని నీకు సంశయం వస్తోంది. దేవుడు ఉన్నాడు, లేడు అని నీ శరీరం సంశయం పడటంలేదు. ఉన్నాడు ఉన్నాడు అనుకొనేవాడు ఉన్నాడో లేడో అని సంశయం పడేవాడు నీలోపల ఒకడు ఉన్నాడు. ఎవడైతే నీలోపల ఉండి ఇలా డౌట్ పడుతున్నాడో వాడిని లోపలకు తోలుకొని వెళ్ళు. ఇలా అనుమానించే వాడు నీలోపల ఉన్నాడుకదా వాడు ఎక్కడనుండి వస్తున్నాడో చూడు, వాడు వచ్చినచోటుకు వాడిని తోలుకొని వెళ్ళు. నీలోపల ఉండి ఎవడైతే సంశయిస్తున్నాడో వాడు లోకం నిజం అనుకొంటున్నాడు, వాడు దేహానికి పరిమితమై ఉన్నాడు. మనకు దేహం నిజం అని, లోకం నిజం అని రెండు తలంపులున్నాయి. అందుచేత నువ్వు కష్టపడి లోపలకు ప్రయాణం చేసినా వీరు ఇద్దరూ నీ పిలక పట్టుకొని బయటకు లాగేస్తూ ఉంటారు. మనకు ఈ లోకం నిజంగానే కనిపిస్తోంది కదా. ఈ నిజాన్ని విడిచిపెట్టి లోపలకు వెళ్లిపోతున్నావు ఏమిటి అని ఆ తలంపు నిన్ను పట్టుకొని బయటకు లాగేస్తుంది. తరువాత కొంతదూరం ప్రయాణం చేసేటప్పటికి దేహం తాలూకా స్పృహ తగ్గిపోతూ ఉంటుంది. అప్పుడు నీకు భయం వేసి మరల బయటకు వచ్చేస్తావు. ఇలా అడ్డువచ్చే తలంపులను గెంటుకుంటూ లోపలకు వెళ్ళగా వెళ్ళగా నీకు శాంతిస్థానం దొరుకుతుంది. ఆ ఆనంద సముద్రంలోనికి, శాంతి సాగరంలోనికి ప్రవేశించేటప్పటికి దేవుడు అసలు నీకు గుర్తుకు రాడు. దేవుడు ఉన్నాడా, లేడా అనే సంశయం

అప్పుడు పోతుంది. అప్పుడు అసలు దేవుడు తాలుక తలంపేరాదు. దేవుడు తాలుక తలంపు వచ్చినప్పుడు కదా దేవుడు ఉన్నాడా లేడా అనే సమస్య, అసలు నీకు ఆ తలంపే రాదు.

నీకు ఉన్న అలవాట్లను, వాసనలను ఈ శరీరంలో ఉండగానే, ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే సాధన చేసి వాటిని తొలగించుకోవాలి కాని ఇతర లోకాలకు వెళితే అక్కడ వీటిని తొలగించుకొనే అవకాశం లేదు. అందుచేత ఈ మానవజన్మను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. నీలో ఉన్న పెంటలోనుండి ఇప్పడే ఇక్కడే విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. నేను అనే తలంపు ఎక్కడ నుండి అయితే ఉదయించి వస్తోందో అక్కడికి వెళ్ళి కరిగిపోయినప్పడు అది సృష్టించిన గొడవలు అన్నీ పోతాయి. నేను అనే తలంపును అలాగే ఉంచుకొని దానిని మినహాయించి మిగతా పనులు అన్నీ చేస్తూ ఉంటే నీకు మోక్షం ఏమిటి? నీకు నిర్వాణస్థితి ఏమిటి అంటున్నాడు బుద్ధుడు. దేవుడు ఉన్నాడా లేడా అనే సంశయం నీకు పోవాలి అంటే ఆ సంశయించేవాడు ఎక్కడ నుంచి అయితే ఉదయించి వస్తున్నాడో అక్కడికి వాడిని విత్‌డ్రా చెయ్యాలి, అంత లోతులలోనికి నువ్వు వెళ్ళగలిగితే నువ్వు పరమశాంతిలో, పరమసుఖంలో ఊగిసలాడతావు. అక్కడ దేవుడి గొడవగాని, దేహం గొడవగాని, లోకంగొడవగాని, అసలు ఏ గొడవ అక్కడ లేదు. గాఢనిద్రలో మనకు తలంపులు లేవు. తలంపులు లేనప్పడు మనకు అక్కడ ఏ గొడవ లేదు. భగవాన్ ఏమంటున్నారు అంటే గాఢనిద్రలో నువ్వు సుఖంగా ఉన్నావుకాని నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలియటం లేదు. జాగ్రదవస్థలో నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తోంది కాని అక్కడ నువ్వు సుఖంగా లేవు, శాంతిగా లేవు. ఈ రెండూ ఒకేసారి నీకు అనుభవంలోనికి రావాలి. ఒక ప్రక్కన ఎరుక ఉండాలి. ఆ ఎరుక ఎలా ఉండాలి అంటే సుఖస్వరూపంగా, శాంతి స్వరూపంగా ఉండాలి. నువ్వు శాంతి సముద్రంలో ఈదులాడేటప్పడు దేహం ఉంటే ఏమిటి లేకపోతే ఏమిటి, దేవుడు ఉంటే ఏమిటి లేకపోతే ఏమిటి ఎవడికి కావాలి. అక్కడ తలంపులే లేనప్పడు ఈ గొడవలు ఏమీ అక్కడ ఉండవు.

నువ్వు అనుకొనే దేవుడు కూడా నీ తలంపు ఎంత నిజమో వాడు కూడా అంతే నిజం అన్నారు భగవాన్. దేవుడు ఉన్నాడా లేడా అంటే ఉన్నాడు. వాడు కర్మఫలదాతగా ఉన్నాడు. నువ్వు మనస్సును తీసేసి కర్మ చేస్తావు అనుకో అప్పడు నువ్వు చేసినా చెయ్యని వాడితో సమానం అవుతుంది. అప్పడు నిన్ను దేవుడు చేసేది ఏమీలేదు. నిన్ను ఏమైనా శిక్షిందామనుకొన్నా ఆయనకు అవకాశం లేదు. సృష్టి ఉన్నవాడికి దేవుడు. నువ్వు సృష్టిని దాటిపోయావు కదా ఇంక నీకు దేవుడు ఏమిటి? ఈ దేహం ఉన్నంతసేపు ఈ దేహంలో నేను ఉన్నాను అనుకొన్నంతకాలం, ఈ లోకం ఉన్నంతసేపు, ఈ లోకంలో నేను బతుకుతున్నాను అనుకొన్నంతకాలం దేవుడు ఉన్నమాట నిజమే. ఎందుచేతనంటే నువ్వు చేసిన పుణ్యానికి

బహుమతులు, నువ్వు చేసిన పాపాలకు పనిష్మెంట్ ఇస్తాడు. ఇదంతా వ్యవహారికంగా నిజమే. శాంతిసాగరంలో నువ్వు ఈదులాడుతున్నప్పడు ఈ శరీరం చనిపోయింది అనుకో నీకు ఏమీ అనిపించదు, నీకు దుఃఖం రాదు. ఎందుచేతనంటే దేహం పోయేటప్పడు ఆ దేహం పోతోంది అనే స్పృహ కూడా వాడికి ఉండదు. వాడు ఉంటాడు, ఉండటంలో స్థిరంగా ఉంటాడు, ఆనందంగా శాంతిగా ఉంటాడు. అప్పడు దేహం ఉండటం వలన వాడికి లాభం లేదు, దేహం పోవటం వలన వాడికి నష్టం లేదు. దేహంపోయినా నేను ఉంటాను అనే అనుభవం అక్కడ పొందుతాడు. అప్పడు శరీరం ఉన్నా శరీరం తాలుక గొడవలు ఏమీ ఉండవు, అప్పడు శరీరం నిన్ను ఏమీ బంధించదు. నువ్వు ప్రపంచంలో ఉన్నా ప్రపంచం నిన్ను ఏమీ బంధించదు. ఆ స్థితిలో ఉన్నప్పడు నిన్ను ఎవరైనా పొగిడినా నీకు ఏమీ అనిపించదు, ఒకవేళ నిన్ను ఎవరైనా తిట్టారు అనుకో ఆ మాటలు నీ చెవులకు వినబడుతూ ఉంటాయి కాని వారు నన్ను తిడుతున్నారు కదా అని నీకు ఏమీ అనిపించదు. ఎందుచేతనంటే అలా అనుకొనేవాడు అక్కడలేడు, వాడు చనిపోయాడు. మీరు గిరి ప్రదక్షిణ చేసుకోండి పుణ్యం వస్తుంది అని ఇటువంటి మాటలు చెపుతూ భగవాన్ ఒకమాట జారారు. దేవుడు అనేవాడు కూడా ఒక తలంపు, ఆ తలంపును తీసేస్తే దేవుడు లేడు అన్నారు. అంటే ఆయన అనుభవానికి భిన్నంగా చెప్పలేకపోయారు.

అసలు మనిషికి ఏమి కావాలి. సుఖం కావాలి. మీరు పూజలు ఎందుకు చేస్తున్నారు, పెళ్ళిళ్ళు ఎందుకు చేసుకొంటున్నారు, మేడలు ఎందుకు కట్టుకొంటున్నారు, డబ్బు ఎందుకు సంపాదిస్తున్నారు? మీరు సుఖపడదాం అని ఇవి అన్నీ చేస్తున్నారు. అంటే నీకు సుఖం కావాలి కాని అసలు దేవుడు నీకు అక్కరలేదు. ఇక్కడ బుద్ధుడు చెప్పే విషయం ఏమిటి అంటే నువ్వు నూటికి నూరుపాళ్ళు సుఖంగా ఉన్నప్పడు నీకు దేవుడితో పనిఏముంది? అసలు వాడితో నీకు పనిలేదు. మీరు నూటికి నూరుపాళ్ళు ఆరోగ్యంగా ఉన్నారు అనుకోండి అసలు డాక్టరు తలంపురాదు, హాస్పటల్ తలంపురాదు. అలాగే నువ్వు నూటికినూరుపాళ్ళు సుఖంగా, శాంతిగా ఉన్నప్పడు దేవుడు ఉన్నాడా, లేడా అనే తలంపు నీకు రాదు. నీకు శాంతి కావాలి కాని ఇప్పడు నువ్వు అశాంతిగా ఉన్నావు. నీలో ఏదో లోటు ఉంది. నీకు ఏదైతే లోటు ఉందో అది ప్రపంచంలోనుండి పొందుదామనుకొంటున్నావు. ప్రపంచం ద్వారా నువ్వు ఏదైనా పొందాలంటే పొందుకాని అది ఏ నాటికైనా దుఃఖంగా మారిపోతుంది, ఇది బాగా గుర్తుపెట్టుకో.

ఈ జగత్తు అంతా బ్రహ్మస్వరూపం. నీ హృదయంలో ఉన్న బ్రహ్మం నీకు తెలియటం లేదు కాబట్టి ఇది బ్రహ్మస్వరూపం అని కూడా నీకు తెలియటంలేదు. ఈ ప్రపంచాన్ని అంతా బ్రహ్మస్వరూపంగా నువ్వు ఆరాధిస్తూ ఉంటే, ఇది అంతా బ్రహ్మంగా నీకు కనిపిస్తూ ఉంటే ఇంక నీకు గుడులేల, గోపురాలు ఏల? ఒకడు గుడి కట్టిస్తాడు అక్కడ విష్ణువు బొమ్మ

పెడతాడు. ఇంకొకడు గుడి కట్టిస్తాడు అక్కడ వినాయకుడి బొమ్మ పెడతాడు, ఇంకొకడు కడతాడు అక్కడ శివలింగం పెడతాడు. అలాగ ఎవరికి ఇష్టమైన దేవుడిని వారు పెట్టుకొన్నా పరవాలేదు నా దేవుడు గొప్పవాడు అంటే నా దేవుడు గొప్పవాడు అని ఏడుస్తారు, ఇదేమి గొడవ. ఆ దేవుడూ అబద్ధమే, ఈ దేవుడూ అబద్ధమే, మరల ఈ అబద్ధాలలో పేచీలు. అసలు ఈ ప్రపంచాన్ని ఉన్నది ఉన్నట్లుగా నేను చూడలేకపోతున్నాను కాబట్టి గుడులు, గోపురాలు వచ్చినాయి. వస్తే వచ్చాయికాని మరల ఇందులో పేచీలు. కోటి రూపాయలు పెట్టి గుడి కట్టమంటే కడతాడు కాని సత్యాన్ని తెలుసుకోవటానికి ఒక్క అంగుళం లోపలకు వెళ్ళమంటే వెళ్ళడు, ఇది మాయ. నీ కోటి రూపాయలు ఎంత నిజమో ఆ గుడీ అంతే నిజం, అందులో ఉన్న దేవుడు కూడా అంతే నిజం. అంటే రాతి మనస్సు ఉన్న వారందరికి రాతి దేవుళ్ళు ఉండాలి కాని నిజమైన దేవుడు ఎవరికి కావాలి. మనం ఏమి చేస్తున్నాము అంటే గుడులు కట్టి, అక్కడ దేవుడి బొమ్మలు పెట్టి వాడికి పూజలు చేసి ఏదో నిన్ను పూజిస్తున్నాము, నైవేద్యం పెడుతున్నాము మా కోరికలు నెరవేర్చు అని అడుగుతున్నాము. నీకు దేహబుద్ధి ఉంది కదా నువ్వు ఉపాసన మానవద్దు. నీకు దేహబుద్ధి ఉన్నప్పుడు ఆ గుడిలో దేవుడు కూడా నీకు నిజంగానే కనిపిస్తాడు. వాడిని దేవుడు అనుకో. వాడిని అది కావాలి, ఇది కావాలి అని అడగటం మానేసి, నీ కోరికల లిస్టు అక్కడ పెట్టకుండా వాడిని ప్రేమించటం ప్రారంభించు. వాడిపట్ల నువ్వు దైవభావన కలిగి ఉంటే వాడు నీ పట్ల దేవుడిగానే వ్యవహరిస్తాడు. నీకు దేహబుద్ధి ఉన్నంత కాలం వాడు దేవుడిగానే కనిపిస్తాడు. నీకు దేహబుద్ధి పోయింది అనుకో అప్పుడు అంతా బ్రహ్మంగానే నీకు కనబడుతుంది.

సాధనల పేరుమీద, పూజలు జపాల పేరుమీద, తీర్థయాత్రలు పేరుమీద దొంగ నేనులో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తున్నారా లేక దొంగ నేను చుట్టూ తిరుగుతున్నారా? సాధనల పేరుమీద వాడి చుట్టూ తిరుగుతూ ఉంటే, వాడిని ముస్తాబు చేస్తూ ఉంటే ఇంక వాడు ఎక్కడికి పోతాడు. మీ ఇంటికి చుట్టం వస్తాడు అనుకోండి. వాడికి నాలుగు కూరలు, స్వీట్స్ వేసి భోజనం పెడుతూ వాడిని గౌరవిస్తూ వాడిని పొమ్మన్నా వాడెక్కడికి పోతాడు. ఈ దొంగ నేనును చుట్టంలాగ చూస్తూ గౌరవిస్తూ ఉంటే అది ఎక్కడికి పోతుంది. ఈ దొంగ నేను రూపంలో అజ్ఞానం ఉంది. అజ్ఞానం అనే చీకటిని బయటకు తోలటానికి వచ్చిన అవతారమే రమణావతారం. భగవద్గీతను ఎప్పడైనా చదువుకోమంటారా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఎప్పడైనా జ్ఞాపకం వచ్చినప్పడు చదువుకోవటం ఏమిటి? నువ్వు రోజూ స్నానం ఎలా చేస్తున్నావో, భోజనం ఎలా చేస్తున్నావో అలాగే రోజూ భగవద్గీతను చదవటం ఒక అలవాటు కింద చేసుకో. ఆల్వేస్ రీడ్, మోర్ రీడ్, మోర్ అండ్ మోర్ రీడ్ అని భగవాన్ చెప్పారు.

మీరు మంచిగా ఉన్నంతమాత్రంచేత మీకు ఆత్మజ్ఞానం కలుగదు. జీవితంలో హెచ్చు తగ్గులు ఉంటాయి. అనేక గొడవలు వస్తూ ఉంటాయి. మీరు మంచి పనులు చేస్తున్నా మీ మీద అసూయ ఉన్నవారు మీరు చెడ్డపనులు చేస్తున్నారని ప్రచారం చేస్తారు. ఇది లోకం యొక్క పోకడ. లోకం చాలా కఠినంగా ఉంటుంది. మీరు మంచి పనులు చేసినంత మాత్రంచేత, మంచిమాటలు చెప్పినంతమాత్రం చేత లోకం మెచ్చుకొంటుందని అనుకోవద్దు, రాళ్ళు పుచ్చుకొని కొడతారు. ఏసుక్రీస్తును శిలువవేసి చంపారు, గాంధీగారిని కాల్చిచంపారు, సోక్రటీసుకు విషం ఇచ్చి చంపారు, అదీ లోకం. వారి మంచితనం భరించలేక అలా చేసారు. ఇటువంటి పాడు లోకం, కఠినత్వం కలిగిన లోకం యొక్క మెప్పలకోసం మీరు చూస్తున్నారా? మీరు మంచి పనులు చేసినా మిమ్మల్ని అగౌరవపరుస్తుంది, అవమానపరుస్తుంది ఈ లోకం. అప్పుడు కూడా మీరు భయం లేకుండా, ధైర్యంగా నిదానంగా ఎలా ఉండాలో పరమాత్మ గీతలో చెప్పాడు, అదీ గీత యొక్క గొప్పతనం. మీరు మంచిగా జీవించండి. ప్రపంచం అంతా మీకు ఎదురుతిరిగినా, మీ నెత్తిమీద దుమ్ముపోస్తున్నా నిర్భయంగా మీరు పోరాడండి. జీవితం విడిచిపెట్టి ఎక్కడికి పారిపోవద్దు, జీవితంలో కష్టాలు వచ్చాయి అని ఏండ్రిన్ తాగి చనిపోవద్దు. కష్టాలు వస్తే ఏమిటి నాకు ఇన్ని కష్టాలు వచ్చాయి అని అనుకోవద్దు, వాటిని అనుభవించండి. సుఖంగా బతకటానికి మంచి ఒక్కటే సరిపోదు. మంచిగా ఉన్నవాడినే ఎక్కువగా మొట్టుతుంది ఈ లోకం. ఆ మొట్టికాయలు తిని నువ్వు ఎలా నిలబడాలి, ఈ లోకంలో సుఖంగా ఎలా జీవించాలి అనేది గీతలో పరమాత్మ చెప్పాడు. ఇంట్లో గొడవలు, బాధలు భరించలేక అనేకమంది చనిపోతున్నారు కదా. అలా ఎందుకు చనిపోవాలి. ఎవరో నిన్ను బాధపెడుతున్నారు అని నువ్వు చనిపోవటం ఏమిటి? అంతపిరికివాడివా నువ్వు? ఎక్కడ నుండి వచ్చింది నీకు ఈ పిరికితనం. ఆ పిరికితనాన్ని బయటకు తోలేవాడిని నేను అంటున్నాడు పరమాత్మ.

నువ్వు మంచిగా ఉండవలెను, ధర్మమును ఆచరించవలెను, సత్యమునే పలుకవలెను అని చెపుతారు. బాగానే ఉంది అయితే ఈ మంచివాళ్ళు అందరూ ఎందుకు చనిపోతున్నారు మరి. ఎందుకువయ్యా ఈ మాటలు, నువ్వు బతకటం నేర్చుకో. నేను మంచివాడిని, మంచిగా బతుకుతున్నాను అని కూర్చోవద్దు. అవసరమైతే పోరాటపటిమ ఉండాలి. అన్యాయం జరుగుతూ ఉంటే దానిని ఖండించాలి. న్యాయానికి అన్యాయం జరుగుతూ ఉంటే ఇంక ఎందుకురా నీ మంచితనం. ఓ అర్జునా నీకు ధర్మబలం ఉంది, వారికి కండబలం ఉంది. ముందు పోరాటపటిమ నేర్చుకో, ఓడిపోతే ఓడిపోతావు, చస్తే చస్తావు. పోనీ ఇప్పడు యుద్ధం చెయ్యవు. యుద్ధంలో చనిపోతాను అని భయం వేసి ఇంటికి వెళ్ళిపోతావు అనుకో, అప్పడు అయినా ఏదో రోజున చనిపోతావు కదా. అందుచేత పనిచేస్తూ చనిపో. నువ్వు చేసేపని

పెర్ఫెక్టుగా చెయ్యి. నువ్వు పని చేస్తూ ఉండాలి, పాపం పొందకూడదు, పని చేస్తూ ఉండాలి పుణ్యం సంపాదించకూడదు. ఈ దొంగనేనుకే పుణ్యం కావాలి, పాపం కావాలి, వాడే నీ కాళ్ళకు అడ్డుపడుతున్నాడు, నిన్ను నడవనివ్వడు. ఏదో పుణ్యం అంటాడు, పాపం అంటాడు. వాడిని తప్పించుకొని వెళ్ళిపో. నువ్వు పని చెయ్యి, ప్రతిదానికి ఆసక్తి పెట్టుకోవద్దు.

ఆయన యొక్క మాయలో పడటానికి పరమాత్మ చాలా బోనులు పెట్టేసాడు. నీ మనస్సులో, బుద్ధిలో, ఇంద్రియాలలో, పంచభూతాలలో మాయ ఉంది. నువ్వు ఎక్కడోచోట, ఏదో బోనులో పడిపోతావు. తెలివైనవాడు నేను తెలివైనవాడిని, తెలివైనవాడిని అనుకొంటాడు ఆ బోనులో పడిపోతాడు. నన్ను ఆశ్రయించకుండా, నామీద గౌరవం లేకుండా ప్రేమ లేకుండా, నా మాటయందు నీకు విశ్వాసం లేకుండా నువ్వు నా మాయలోనుండి బయటకు వచ్చే సమస్యలేదు అంటున్నాడు పరమాత్మ. ఏ కారణాలు అయితే నీకు పునర్జన్మను తీసుకొని వస్తాయో ఆకారణాలలో నుండి నిన్ను విడుదలచేసేవాడే గురువు. ఎవరి దగ్గర ఎలా ప్రవర్తిస్తే వారి వాసనలు పోతాయో గురువు చూసుకొంటాడు. నీ స్తోత్రాలు ఆయనకు అక్కరలేదు, ఒకవేళ నువ్వు ఆయనను నిందించినా దానిని ఆయన తీసుకోడు. వీటి అన్నింటికి ఆయన అతీతంగా ఉన్నాడు. నీపట్ల ఎలా ప్రవర్తిస్తే నీలో ఉన్న వాసన వేరుతోసహా బయటకు పోతుందో అలా ప్రవర్తిస్తాడు. మీలో ఉన్న వాసనలను తొలగించటం ముఖ్యం, అదే గురువు చూసుకొంటాడు.

మనం చనిపోయే చివర రోజున ఏ స్థాయిలో ఉన్నాయో చనిపోయాక కూడా అదే స్థాయిలో ఉంటాముకాని చనిపోయాక ఇంక నీకు ప్రోగ్రెస్ లేదు. అందుచేత ఈ దేహం భూమి మీద తిరుగుతున్నప్పుడే సాధనచేసి దానిమీద అభిమానం తగ్గించుకోండి, అహంకారం తగ్గించుకోండి. దేహం చనిపోయాక నువ్వు చేసేది ఏమీ లేదు, దేహం ఉండగా దేహం పట్ల నేను, నాది అనే భావాలు నీకు ఉన్నాయి కదా సాధన చేసి వాటిని తగ్గించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీ శరీరం ఎక్కడ తిరుగుతూ ఉన్నా నీ మనస్సును ఈశ్వరుడి పాదాల మీద నిలబెట్టి ఉంచు. నీ మనస్సు ఆత్మజ్ఞానంలో స్థిరపడి ఉండాలి. ఎక్కడ నీ మనస్సును ఉంచాలో అక్కడ పెట్టి అంటే స్వరూపజ్ఞానంయందు నీ మనస్సును నిలబెట్టి ఉంచి నీ శరీరానికి ఏవైనా పనులు ఉంటే అటూ ఇటూ తిరిగి చూసుకో, నువ్వు ఏ పని చేసినా యజ్ఞంగా చెయ్యి, ఆ పనివలన భగవంతుడి దయ నీకు రావాలి. నీ సొంతపని ఎలా చేసుకొంటావో ఇతరులకు చేసే పని కూడా అలాగే చెయ్యాలి. ఎవరికి ఏ పని చేసినా అది మన సొంతపని అనే భావనతో చెయ్యాలి. నువ్వు ఎవరికైనా సేవ చేస్తున్నావు అనుకో ఆ దేహం కూడా నీ దేహం అనుకొనే చెయ్యాలి. అప్పుడు పని చేసినా నువ్వు టైర్ అవ్వవు. ఆ దేహం వేరు ఈ దేహం వేరు అనుకొని పనిచేస్తూ ఉంటే మనం టైర్ అయిపోతాము. ఆ

వేరుబుద్ధి ఉన్నప్పుడు భగవంతుడి అనుగ్రహం మనకు రాదు.

భగవాన్ ఆయనకు ఆయన అరుణాచలరమణుడు అని పేరు పెట్టుకొన్నారు. ఆయనకు అరుణాచలం అంటే బాగా ఇష్టం. ఈ సృష్టిలో ఆయనను ఆకర్షించిన వస్తువు ఏదైనా ఉంది అంటే అది అరుణాచలమే. అది తప్పింది ఎక్కడా ఆయనకు ఎట్రాక్షన్‌లేదు. అది అరుణాచలేశ్వరుడికి ఆయనకు ఉన్న సంబంధం. అరుణాచలం అనేటప్పటికి ఆయనకు సాక్షాత్తు పరమేశ్వరుడు జ్ఞాపకం వచ్చాడు కాని అక్కడ ఊరుకాని, కొండకాని ఆయనకు జ్ఞాపకం రాలేదు అది పూర్వజన్మ అనుబంధం. పేరుదలపగనే పట్టి లాగితివి నీ మహిమ కనుదురెవరు అరుణాచలా। అరుణాచలా... అని నీ పేరు స్మరించేటప్పటికే నా మనస్సు ఎక్కడో లోయలలోనికి వెళ్ళి పడిపోయింది. నీ పేరు తలపెట్టగానే నన్ను అజ్ఞానంలోనుండి, ప్రాపంచిక వాసనలలోనుండి, దేహవాసనలోనుండి బయటకు లాగి నన్ను రోడ్డుమీద విడిచి పెట్టలేదు, నీ స్వరూపాన్ని నాకు ఇచ్చావు. మానవజాతి అంతా ఏ స్థానాన్ని పొందటానికి ప్రయత్నం చేస్తోందో, బేధభావన లేనిస్థితి ఎక్కడ ఉందో అక్కడకు నన్ను తీసుకొనిపోయావు. నీ పేరు తలపెట్టటం వలననే ఇది అంతా చేసావు. నన్ను బంధంలోనుండి విడిపించి బంధం లేని స్థితికి తీసుకొనిపోయే వరకు నీవు జ్ఞానస్వరూపుడవు, ప్రేమస్వరూపుడవు అని నాకు తెలియదు. నీ స్మరణలోనే ఇంత మహిమ ఉందని నాకు తెలియదు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్.

పని పని కోసమే ఎవడైతే చేస్తున్నాడో, పనిలో నుండి మనస్సును తీసేసి ఎవడైతే చేస్తున్నాడో పనిలో నుండి మనస్సును తీసేయటం అంటే ఇది నేను చేస్తున్నాను అనే తలంపును తీసేయాలి, అలా నువ్వు పనిచేస్తూ ఉంటే నువ్వు చేసినా చెయ్యనివాడితో సమానము, ఆ పని నిన్ను బంధించదు, నువ్వు ద్వైతాన్ని దాటి వెళ్ళిపోతావు. నువ్వు చేసే పనిలో బ్రహ్మమును చూడు అప్పుడు నువ్వు బ్రహ్మమును పొందుతావు. నువ్వు ఎవడికైనా అన్నం పెడుతూఉంటే ఎల్లయ్యకు, పుల్లయ్యకు పెడుతున్నాను అనుకోవద్దు, బ్రహ్మమే ఆ రూపంలో ఉంది అనుకొని పెట్టు. నువ్వు బ్రహ్మం, పెట్టటం అనే పని బ్రహ్మం, నువ్వు ఎవరికైతే పెడుతున్నావో వాడు బ్రహ్మం. ఇలా అనుకొంటూ నువ్వు పని చేస్తూ ఉంటే సహజంగానే నీకు బ్రహ్మభావన వచ్చేస్తుంది. అందుచేత ఎలా పని చెయ్యాలో తెలుసుకొని చెయ్యి. నువ్వు ప్రతీపని బ్రహ్మభావనతో కనుక చేస్తూ ఉంటే అది పుణ్యం అయినా పాపం అయినా మొత్తం కంప్లీట్‌గా వేరుతోసహా నశించిపోతుంది, అలా కర్మచేసేటప్పుడు నీకు వాసన పడదు. ఇంక వాసన లేనివాడికి పునర్జన్మ ఏమిటి? ఇదంతా నువ్వు సాధన చేసి సంపాదించగలవా, లేదు. నా దయ ఉంటే నువ్వు సంపాదించగలవు అంటున్నారు పరమాత్మ. ఉన్నది బ్రహ్మం ఒక్కటే కాని ఇన్ని రకాలుగా కనిపిస్తోంది. బ్రహ్మమే ఇన్ని రకాలుగా కనిపిస్తోంది అనేటువంటి బుద్ధి మనకు

రావటం లేదు అంటే మరల ఇక్కడ మాయచేసేస్తున్నాడు. సత్యసాక్షాత్కారం పొందకుండా, ఆత్మజ్ఞానం సంపాదించకుండా ఈ శరీరం చనిపోతే నువ్వు పొందేది ఏముంది? ఇంక నువ్వు ఏమి సాధించినట్లు? మిగతావన్నీ ఒకటిలేని సున్నలు.

రమణమహర్షిగారు చెప్పిన ఈ మాటను మీరు గుర్తుపెట్టుకోండి. ఈ లోకం అసత్యం. ఈ లోకం స్వప్నసమానము. ఈ లోకం అసత్యం అనే భావన స్థిరపడకపోతే మీ మనస్సు లోపలకు వెళ్ళదు. ఈ లోకం నిజం అని మీరు అనుకొంటూ ఉంటే మీ మనస్సు లోపలకు ఎలా వెళుతుంది. ఇది అబద్ధం. ఈ అబద్ధం అబద్ధంగా మీకు కనిపించినప్పుడు మీ మనస్సులోపలకు వెళుతుంది. కాని ఈ లోకం ఎంత అబద్ధమో అంత నిజంగా మనకు కనిపిస్తోంది, ఇదే మాయ. ఈ లోకం నిజంగా కనిపిస్తున్నంతకాలం నీ మనస్సు బాహ్యముఖం అయిపోతుంది కాని దానిని లోపలకు తోలుకొనివెళ్ళటం నీకు సాధ్యంకాదు. ఇది అబద్ధం అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడుకదా నీ మనస్సులోపలకు వెళ్ళేది, లేకపోతే అది లోపలకు వెళ్ళదు బయటకు వచ్చేస్తూ ఉంటుంది. ఒకవేళ నువ్వు బలవంతంగా లోపలకు తోలుకొనివెళ్ళినా అది బయటకు వచ్చేస్తుంది. అందుచేత భగవాన్ ఏమంటున్నారు అంటే ఈ కనిపిస్తున్న లోకం స్వప్నసమానమే, ఇది అసత్యమే అని నువ్వు భావించు. ఇది నిజం కాదు అని నువ్వు అనుకొన్నప్పుడు మనస్సులోపలకు వెళ్ళటం నేర్చుకొంటుంది లేకపోతే నువ్వు ఎన్ని ప్రయత్నాలు చేసినా అది బయటకు వచ్చేస్తూ ఉంటుంది గాని లోపల నిలబడదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-12-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు సుబ్రహ్మణ్య షష్ఠి అంటే సుబ్రహ్మణ్యుడు శరీరం ధరించిన రోజు. శివుడికి, సుబ్రహ్మణ్యుడికి తేడాలేదు. అయితే శివుడు పాతరూపాయి, సుబ్రహ్మణ్యుడు కొత్తరూపాయి. సుబ్రహ్మణ్యుడిని తమిళనాడులో మురుగ అంటారు. కార్తికేయుడు అంటారు, కుమారుడు అంటారు. సుబ్రహ్మణ్యస్వామికి ఇలా చాలాపేర్లు ఉన్నాయి. రమణమహర్షిగారు సుబ్రహ్మణ్యుడి అంశఅని గణపతిశాస్త్రి గారు చెప్పారు. గుడిలో రాయిని పెట్టి సుబ్రహ్మణ్యస్వామి అని అంటున్నారు కదా అలానే ఈ దేహాన్ని సుబ్రహ్మణ్యస్వామి అంశ అని అంటే ఆయనను అనుకోనివ్వండి అన్నారు భగవాన్. గణపతిశాస్త్రిగారిని ఖండించలేదు, ఆయనను ప్రోత్సహించలేదు. పరమసత్యం మీదే ఆయన మనస్సు పెట్టారుగాని ఇటువంటి గొడవలు ఏమీ ఆయనకు లేవు. ఒకవ్యక్తిగా చూసినప్పుడు ఈ ప్రపంచంలో బుద్ధుడి కంటే గొప్పవాడు ఎవడూలేడు అని స్వామీజీ ఒక సందర్భంలో చెప్పారు. గ్రంధాలదగ్గరకు వచ్చేటప్పటికి భగవద్గీత అంత గొప్ప గ్రంధం ఈ ప్రపంచంలో లేదు అన్నాడు. భగవద్గీత యొక్క లోతులు మీకు

అందకపోవచ్చు కానీ అంత గొప్ప గ్రంథం ఈ ప్రపంచంలో లేదు అని చెప్పాడు. తెలివితేటలు, విశాలమైన బుద్ధి దగ్గరకు వచ్చేటప్పటికి వ్యాసుడి గురించి చెప్పాడు. భగవద్గీత చెప్పింది కృష్ణపరమాత్మ అయితే దానిని వ్యాసుడు శ్లోకబద్ధం చేసాడు.

రామకృష్ణుడు ఎక్కడికి తిరిగి ఉపన్యాసాలు చెప్పలేదుగాని ఆయన దగ్గరకు వచ్చేవారికి రోజూ 16గంటలు బోధించేవాడు. చాకలివాడు బట్టలను రాయిమీద కొడతాడు, వాడికి బట్టలమీద కోపం కాదు, బట్టలకు ఉన్న మురికిని పోగొట్టటానికి వాటిని రాయిమీద కొడతాడు అలాగే ఆయన మాటల ద్వారా మీలో ఉన్న మురికిని, బలహీనతలను పోగొట్టటానికి రోజుకు 16గంటలు చెప్పేవాడు. భక్తులు ఎలా ఉన్నారు అంటే భగవంతుడు ఏ పని అయితే చెయ్యమన్నాడో ఆపని చెయ్యటంలేదు భగవంతుడు ఏపని అయితే వద్దు అని చెబుతున్నాడో ఆపని ఎక్కువ చేస్తున్నారు ఇలా భక్తులు అందరూ తప్పులు చేస్తున్నారు, మాయలో పడుతున్నారు. మనం ఏదయినా ప్రమాదంలో పడ్డప్పుడు ఏమి చెయ్యాలి అంటే ఆ ప్రమాదం నుండి ఎలా బయటికి రావాలో ముందు ఆలోచించుకోవాలి అంతేగాని గంగానదిలోనో, కృష్ణానదిలోనో ఏదో నదిలో మునిగిరావటం మా తప్పులు క్షమించమని వేడుకోవడం అక్కడనుంచి మేము పవిత్రులం అయిపోయాము, మంచివాళ్ళము అయిపోయాము అనుకోవటం వాళ్ళకి ఇంకోపనిలేదు. ఎక్కడ గుడి కనపడితే అక్కడకి వెళ్ళి ఆదేవుడిని మా తప్పులు క్షమించమని లెంపలు వాయించుకుని వచ్చేస్తారు. మరుసటి రోజున మళ్ళీ మామూలుగా తప్పలు చేస్తారు. అసలు పద్ధతి ఇది కాదు. ముందు మనకి ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకుని ఆ బలహీనత ఎలా పోతుందో దానికి విరుగుడు ఆలోచించి దానిలోనుండి తొలగించు కోవటానికి ప్రయత్నం చేస్తూ నా మనస్సులో ఈ బలహీనత ఉంది, దానిలోనుంచి నన్ను విడుదల చెయ్యి అని నువ్వు దేవుడిని ప్రార్థించు. సత్‌పురుషుల తోటి, మహాత్ముల తోటి నువ్వు సహవాసం చెయ్యి ఇలాగ చేస్తే నువ్వుఆ బలహీనతలోంచి బయటకు వస్తావు కాని నువ్వు నదులలో మునిగితే నీ బలహీనతలోంచి బయటకు రాలేవు, గుడికి వెళ్ళి లెంపలు వాయించుకుంటే నీ బలహీనతలోంచి బయటకు రాలేవు. ఆత్మ అనే నదిలో, ఆత్మ అనే సముద్రంలో స్నానం చేసేవరకూ మీకు జాడ్యాలువదలవు, మీకు మోక్షం లేదు. నీకు ఏరకమైన చెడ్డ అలవాటు ఉన్నా దాని గురించి కంగారు పడకు అసలు ఆ చెడ్డ అలవాటులోంచి బయటకు రావాలనే ఉద్దేశ్యం మనకు ఉంటే దానికి మందులు ఉన్నాయి ఆమందులు వాడితే ఆ బలహీనతలోంచి బయటకు వచ్చేస్తావు.

లక్ష్మణుడు రాముడికి శరణాగతి చేశాడు. లక్ష్మణా కామంకంటే ధర్మంగొప్పది. ధర్మంతోటి సంబంధంలేని కామాలు ఎప్పటికయినా ప్రమాదాలు తీసుకువస్తాయి, నిషిద్ధ కర్మలవలన చాలా ఆందోళన వస్తుంది, చిక్కులలో పడతాడు. మనిషికి ప్రమాదాలు

ఎందుకువస్తాయి అంటే ధర్మాన్ని విడిచి పెట్టేసి కామంలో పడటంవలన ప్రమాదాలు వస్తాయి అని రాముడు లక్ష్మణుడికి చెబుతున్నాడు. ఎవరిగురించో చెబుతున్నాడేమో అనుకుంటాడు లక్ష్మణుడు. మన తండ్రిగారు ధర్మానికంటే కామానికి ఎక్కువ విలువ ఇచ్చారు, కామం మాయలో పడ్డారు. కామానికి విలువ ఇవ్వటం వలన ప్రమాదంలో పడ్డారు, ఆందోళనలో పడ్డారు, అశాంతిలో పడ్డారు ధర్మాన్ని విడిచిపెట్టి కామం జోలికి వెళ్ళకూడదు వెడితే ప్రమాదంలో పడతారు. ధర్మాన్ని విడిచిపెట్టి కామానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తే మన తండ్రిలాగ అయిపోతారు లక్ష్మణా. ఇది అంతా కామం తీసుకువచ్చే గొడవ అన్నాడు రాముడు.

మనం నేర్చుకోవలసింది ఏమిటి అంటే మనం ఏ పని చేసినా పొగిడేవాళ్ళు ఉంటారు, విమర్శించేవాళ్ళు ఉంటారు. అప్పడు రియాక్టు అవ్వవద్దు అని భగవద్గీతలో పరమాత్మ చెప్పాడు. లెర్న్ నెవ్వర్ టు రియాక్ట్. నిన్ను విమర్శిస్తూ ఉంటారు, ఆ విమర్శ చేసిన వాడిది తప్పకాదు. ఆ విమర్శకి నువ్వు దుఃఖం తెచ్చుకోవటం నీది తప్ప. నీ పని ఏదో నువ్వు చేసుకొని వెళ్ళిపో రియాక్టు అయ్యే స్వభావం ముందు తగ్గించుకో. ఎలా ఉంటే రియాక్టు అవ్వకుండా ఉంటావో అలా ఉండటం నేర్చుకో. వివేకం ఉన్నవాడికి సమాన బుద్ధి ఉంటుంది, వివేకం లేనివాడికి సమానబుద్ధి ఉండదు. ఇది సత్యము, ఇది అసత్యము అని విడదీసుకొనే బుద్ధిని వివేకము అంటారు. వివేకవంతుడికి రియాక్షన్ ఉండదు. సమాన బుద్ధి కలవాడే వివేకవంతుడు. నువ్వు ఫలితాన్ని ఆశించకుండా పని పని కోసమే చెయ్యాలి, ఆ పనిని ప్రేమించి చెయ్యాలి, నీ కోరిక తోటి సంబంధం లేకుండా ఏదైనా ఫలితం వచ్చినా అది నిన్ను బంధించదు. నువ్వు కర్మఫలితాన్ని ఆశించినప్పడు నీకు జన్మరాకుండా ఎలా ఉంటుంది. నువ్వు జన్మపరంపరలో కొట్టుకుపోవలసిందే. కర్మచేసి ఫలితాన్ని ఆశించనివాడు బుద్ధిమంతుడు. నువ్వు ఫలకాంక్ష లేకుండా పనిచేస్తూ ఉంటే నువ్వు సంసారంలో ఉన్నా సన్యాసితోటి సమానం.

చదువుకున్నవాడు పని చేయడు, చదువులేనివాడు పని చేస్తాడు లాజిక్కు ఇది. ఇక్కడ ఆచార్యులవారు ఉద్దేశ్యం ఏమిటి అంటే ఆత్మవిద్య ఉన్నవాడు పనిచేసినా వాడికి ఫలకాంక్ష లేదు కాబట్టి ఆ పని వాడిని బంధించదు వాడు పని చేసినా చెయ్యనివాడితో సమానము. వాడికి పునర్జన్మ ఉండదు. అందుకు చదువుకున్నవాళ్ళు ఎవరూ పని చేయరు అన్నాడు. చదువులేని వాళ్ళు పని చేస్తారు అంటే మనం పని చేసి ఫలితాన్ని ఆశిస్తాము. ఆ ఫలితం మనల్ని బంధిస్తుంది. ఆ బంధం మళ్ళీ పునర్జన్మలని తీసుకు వస్తుంది. అందుచేత చదువులేనివాళ్ళు పనిచేస్తారు అన్నాడు. ఇక్కడ చదువులు అంటే కాలేజీ చదువులుకాదు. ఆత్మవిద్య ఉన్నవాడు చేసిన కర్మఅంతా అకర్మ అయిపోతుంది. కర్తృత్వం ఉన్నప్పుడు నువ్వు ఫలితం కోరుకోకుండా ఉండలేవు. కర్తృత్వం లేకుండా పని చేస్తే, కర్మ ఫలాన్ని త్యాగం చేసి

పనిచేస్తూఉంటే వాడు చావుపుట్టుకలనుండి విడుదల పొందుతాడు. నువ్వు కర్మ ఫలాన్ని ఆశిస్తున్నావు కాబట్టి నువ్వు పుట్టి తీరాలి. ఎందుకు పుట్టాలి అంటే? ఆ ఫలితాన్ని అనుభవించటానికి మీరు పుట్టి తీరతారు. భగవంతుడు మాయ ఏమిటి అంటే, దూడని కట్రాడికి కట్టకుండా వదిలేయండి, ఆ దూడకు ఒక దెబ్బ కొడితే ఆ దెబ్బ పడుతుంది. రెండో దెబ్బకు ఆ దూడ దూరంగా పారిపోతుంది. ఆ దూడనే మీరు కట్రాడుకి కట్టేసి కొట్టండి ఎన్ని దెబ్బలు కావాలంటే అన్ని దెబ్బలు కొట్టవచ్చు ఇంక ఎక్కడికి వెళ్ళలేదు అలాగే మనం ఈ దేహం నేను అనుకుంటున్నాము ఇది నూటికి నూరుపాళ్ళు నిజంకాదు. ఈ దేహము నేను అనే భావన పరమాత్మ ఎందుకు పెట్టాడు అంటే మనం పూర్వజన్మలో మంచికర్మలో, చెడ్డకర్మలో చేసి ఉంటాము కదా! ఆ దేహము నేను అనే భావం నీకు లేకపోతే నువ్వు కర్మఫలితాన్ని అనుభవించవు. అందుచేత నీకు దేహబుద్ధిని కలుగజేసి ఆ కర్మఫలితం పెట్టి నిన్ను కొడుతూ ఉంటాడు. నీకు దేహము నేను అనే బుద్ధి ఉంది కదా అంటే ఈ జీవుడు దేహము అనే కట్రాడికి కట్టబడి ఉన్నాడు. నీకు అక్కడ పారిపోవటానికి అవకాశము లేదు. ఇది అంతా ఈశ్వరుడు చేస్తున్నాడు.

ఆచార్యులవారిని ఒక శిష్యుడు అంటాడు మీరు బ్రహ్మసత్యం, జగత్‌మిధ్య అన్నారు మీరు చెప్పింది తప్పు. మీకు నేను కనిపిస్తున్నాను, నాకు మీరు కనిపిస్తున్నారు. ఒక ప్రక్క మంచికర్మ, చెడ్డకర్మ ఫలితాలు అనుభవిస్తున్నాము ఇది అంతా నిజం కాదు. మిధ్య అంటే ఎలా కుదురుతుంది అన్నాడు. ఆచార్యులవారు మౌనంగా ఊరుకున్నారు. ఆచార్యులవారు, శిష్యుడు ఒక గదిలో పడుకున్నారు. ఆరోజు అమావాస్య. ఆచార్యులవారు ఆ శిష్యుడిని లేపి బయటకు రమ్మన్నారు. ఆ శిష్యుడు బయటకు రాగానే అమ్మబాబో అని ఇంట్లోకి పరుగెత్తాడు. అక్కడ ఒక తాడు చీకట్లో అతనికి పాము కింద కనిపించింది. భయపడి లోపలకు వెళ్ళిపోయాడు. ఇంకొక భక్తుడిని లేపి దీపం తెమ్మన్నాడు ఆ దీపం వెలుగులో ఆ తాడుని చూపించారు. ఇప్పుడు ఎలా కనిపిస్తోంది అని అడిగారు అది తాడే అన్నాడు. మరి నీకు తాడు తాడుగా కనిపించాలి కాని పాముకింద నీకు ఎందుకు కనిపించింది అన్నారు. చీకటి వల్ల తాడు పాము కింద కనిపించింది, వెలుతురు రాగానే తాడు తాడుగానే కనిపించింది అన్నాడు. తాడు నీకు పాముగా కనపడటానికి చీకటి ఎలా కారణమో ఈ కనిపిస్తున్నది బ్రహ్మము అయినప్పటికీ నీకు ప్రపంచముగా కనిపించటానికి నీ అజ్ఞానము కారణము. పాముని చూస్తే భయం ఉన్నట్టు, ప్రపంచాన్ని చూస్తే భయం వేస్తుంది. వేరు భావన ఉన్నంత సేపూ భయాన్ని ఎవరూ ఆపుచేయలేరు. అజ్ఞానం ఉన్నప్పుడు వేరుబుద్ధి రాకుండా ఉండదు. ఉన్న వస్తువుని ఉన్నట్లుగా చూడటం వలన నీకు భయం పోయింది. ఉన్న వస్తువు ఉన్నట్టుగా చూడటానికి నీకు ఏది సహాయం చేసింది?

దీపం సహాయం చేసింది. అలాగే నీకు ఈ ప్రపంచం ఉన్నది ఉన్నట్లుగా కనపడాలి అంటే బ్రహ్మజ్ఞానం రావాలి. నీకు బ్రహ్మజ్ఞానం రాగానే ఈ ప్రపంచం ఎక్కడికి పారిపోదు, బ్రహ్మములో ఐక్యమవుతుంది. అప్పుడు ప్రపంచం నీకు బ్రహ్మముగా కనిపిస్తుంది అన్నారు ఆచార్యులవారు.

భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం ఉండాలి. విశ్వాసం లోతుగా ఉండాలి, బలంగా ఉండాలి. ఇక్కడ చదువు, పాండిత్యం కాదు కావలసింది భగవంతుడు పట్ల సజీవమైన విశ్వాసం ఉండాలి. రామకృష్ణుడి దగ్గర 16 మంది శిష్యులు ఉండేవారు. రామకృష్ణుడికి కేన్సరు వచ్చినప్పుడు ఈ 16 మంది శిష్యులు చూసేవారు. రాఖాల్ ఇంకో 15 రోజులకు రామకృష్ణుడు దగ్గరకి వస్తాడు అనగా కాళీమాత ఆయనకు కనిపించి నీకో కొడుకుని పంపుతున్నాను అంది, నాకే పొట్టవెళ్ళటంలేదు నేను పోషించలేను అని చెప్పాడు. వాడిని నువ్వు పోషించనక్కరలేదు వాడు నీ శరీరానికి పుత్రుడు కాదు, నీ మనస్సుకి పుత్రుడు అని అమ్మ చెప్పింది. శిష్యులు అందరూ కింద కూర్చునేవారు కాని రాఖాల్‌ని ఆయన కూర్చున్న బెంచీమీద పక్కన కూర్చోమనేవారు. రామకృష్ణుడు నాలుగు రోజులకి శరీరం వదిలిపెడతారు అనగా ఆ రాత్రి నరేంద్రుడు, రాఖాల్, శశి, శారదానంద వీరు నలుగురు దగ్గర ఉన్నారు. అప్పుడు రామకృష్ణుడు అంటాడు సామాన్య మానవుడు ఎలా బాధపడతాడో, నేను ఈ కేన్సర్ వ్యాధితోటి అలా బాధపడుతున్నాను ఇంకా నన్ను అవతారపురుషుడని నమ్ముతున్నారా అంటాడు. వాళ్ళ నమ్మకం ఊడగొట్టటానికి షేక్ చేసాడు. అప్పుడు రాఖాల్ అంటాడు ఏసుక్రీస్తు కూడా నీకంటే ఎక్కువ బాధలు పడ్డాడు అయితే ఏసు ప్రభువు అవతారపురుషుడు కాదా! ఓ రామకృష్ణదేవా నేను అవతారపురుషుడనయితే ఇంత బాధపడతానా అన్న ఈ క్లిష్టసమయంలో కూడా నువ్వు అవతారపురుషుడవే మా బుద్ధిలో ఎటువంటి చాపల్యం లేదు, మా విశ్వాసంలో ఏమీ చాపల్యం లేదు. ఓ రామకృష్ణదేవా, ఓ గురుదేవా నువ్వు ఎలా మాట్లాడినా నువ్వు అవతారపురుషుడివే అని రాఖాల్ (బ్రహ్మానంద) చెప్పాడు. వాడి విశ్వాసం షేక్ అవ్వలేదు. అది లివింగ్ ఫెయిత్.

ఇంద్రియాల్ని నిగ్రహించుకోవటం, మనస్సుని నిగ్రహించుకోవటం మీకు చాలా కష్టం. నా ఆస్థి అంతా మీకు ఇచ్చి వెళ్ళిపోతున్నాను. మీరు అందరూ ధనవంతులు అయిపోయారు, నేను పేదవాడిని అయిపోయాను నా సాధనాశక్తిని మీ 16 మందికి పంచి పెట్టి వట్టి చేతులతో వెళ్ళిపోతున్నాను రాఖాల్ అన్నాడు రామకృష్ణుడు. నరేన్ నువ్వు ప్రపంచం అంతా తిరిగి బోధిస్తావు అంటే నాకు ఆ పని ఇష్టంలేదు నేను తరిస్తే చాలు అంటాడు. ఒకవేళ నీకు చెప్పటం ఇష్టంలేదు అనుకో, నువ్వు చెప్పటం మానేయి నీ ఎముకలు ప్రపంచం అంతా తిరిగి బోధించి వస్తాయి. నీ నోరుని దేవుడు ఉపయోగించుకుంటాడు. దేవుడు నీ శరీరాన్ని ఉపయోగించుకోవాలి అనుకున్నప్పుడు దేవుడి కళ్ళు కప్పి నువ్వు ఎక్కడికి పారిపోతావు నరేన్ అంటాడు రామకృష్ణుడు.

లెర్న్ నెవ్వర్ టు రియాక్ట్. ఇది మీకు చేతకాకపోతే నేర్చుకోండి. మిమ్మల్ని కొంతమంది పొగుడుతూ ఉంటారు, కొంతమంది విమర్శిస్తూ ఉంటారు అక్కడ రియాక్టు అయ్యారు అనుకోండి మీ స్వరూపానికి మీరు దూరం అయిపోతారు. మీ నేచర్‌కి మీరు దూరం అయిపోతారు. మీరు ప్రతీదానికి రియాక్టు అవుతూ ఉంటే మీకు స్వరూపజ్ఞానంరాదు. కొంతమందికి రూపాయలు లేకపోయినా వైరాగ్యం అనే సంపద ఉంటుంది. ఆ వైరాగ్యం అనే సంపద ఉన్నవాళ్ళకి ఆత్మజ్ఞానం వచ్చి తీరుతుంది. ధనం వలన ఏ మనిషికి జ్ఞానం రాదు. వైరాగ్యం అనే సంపద ఎవడైతే సంపాదించుకుంటున్నాడో వాడికి రెండు పూటలా తిండి లేకపోయినా, వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. జ్ఞానానికి పెట్టుబడి ధనంకాదు వైరాగ్యం ఉండాలి. మీరు నీళ్ళలో తేనె కలిపి గ్లాసులో పోసి అక్కడ పెడితే చీమలు, ఈగలు ఆ గ్లాసు అంచు పట్టుకొని దాన్ని నాకుతాయి. ఆ పానకంలో దిగవు అందులో పడితే ఇంక బయటకు రాలేము చచ్చిపోతామేమో అని వాటికి భయం. పరమాత్మ ఏమని చెబుతున్నాడు అంటే మీరు చీమలలాగ, ఈగలలాగ అంచుల దగ్గర ఉండి నాకనక్కరలేదు. ఆ బ్రహ్మములో మీరు ఉరికేస్తే చచ్చిపోతారు అనుకోకండి దాని స్వరూపం మీకు ఇచ్చేస్తుంది కాని అదేమి మిమ్మల్ని చంపదు. ఆ బ్రహ్మమే మీ స్వరూపంగా వ్యక్తమవుతుంది. నాకితే లాభంలేదు. ఐక్యమైపోవాలి. ఈగల్లాగ నాకుతూ కూర్చుంటే మీకు పూర్తి ఆనందం రాదు. అది పానకం లాంటిదికాదు, అది బ్రహ్మము. అందులో పడిపోండి అంటున్నాడు పరమాత్మ.


మీరు కర్మఫలితాన్ని ఆశించి పుణ్యం చేసినా అది బంధిస్తుంది, పాపం చేసినా బంధిస్తుంది. రెండూ బంధించేవే కాబట్టి మీ శరీరాన్ని విడిచిపెట్టకముందే పుణ్యపాపాలని రెండూ వదిలేయండి. పుణ్య పాపాలను ఎలా విడిచిపెట్టగలవు నువ్వు. యోగాన్ని ఆశ్రయించాలి. యోగం అంటే భగవంతుడిలో నిన్ను ఐక్యం చేసేది యోగం. అది భక్తియోగం అయినాసరే, జ్ఞానయోగం అయినా సరే అన్నాడు పరమాత్మ. భక్తి గురించి వివేకానందుడు ఏమన్నాడు అంటే అసలు భక్తే వైభవం, భక్తే వైకుంఠం. నీకు భక్తే చాలు అంటాడు. భక్తి సంపాదించుకొని లోకాలకి వెళదామనుకుంటున్నావా? నువ్వు వెళ్ళే లోకాలు భక్తికంటే ఔన్నత్యంగా ఉంటాయా? భక్తే రివార్డు. నీకు అంతకంటే పెద్ద బహుమతి ఏమి కావాలి. చాలామందికి భక్తి విలువ తెలియదు. కొంతమంది అంటారు వాళ్ళకు ఏమిటండి ఏదో భక్తి ఉంది అంతే అంటారు. ఆ భక్తి ఎంత కష్టపడితే సంపాదించుకున్నారో కూడా వారికి తెలియదు. భక్తి కంటే ఎక్కడో ఏదో గొప్పది ఉంది అనుకోవటం అది మీ ఊహల్లోనుండి మీ తలంపులలో నుండి వచ్చింది. కాని అది నిజం కాదు. భక్తి ఇచ్చే శాంతి, భక్తి ఇచ్చే ఆనందం కంటే గొప్ప ఆనందం ఇతర లోకాలు ఇస్తాయా? భక్తికి మించిన పెద్ద బహుమతి ఉందా అని వివేకానందుడు భక్తి గురించి చెప్పాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఫిబ్రవరి | 14 | అర్తమూరు, వేంకటేశ్వరస్వామి వారి దేవాలయము (వయా మండపేట) |
| ఫిబ్రవరి | 17 | కైకలూరు, టిటిడి కళ్యాణ మండపం |
| ఫిబ్రవరి | 21 | భీమవరం, శివ కళ్యాణ మండపం |
| మార్చి | 2 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం (శివరాత్రి) |
| మార్చి | 6 | పాలమూరు |
| మార్చి | 19 | చించినాడ, గీతామందిరం |
| మార్చి | 30 | పోడూరు |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha



శ్రీ చావలి సూర్యనారాయణమూర్తి గారు ది॥ 31-12-2010న పదవీ విరమణ సందర్భంగా గోడిలంక పాఠశాలలో సద్గురు శ్రీనాన్నగారు

# ప్రేమ లేకుండా - పరమాత్మ స్వాధీనం కాడు

అందరి హృదయాలలో పరమాత్మ ప్రకాశిస్తున్నాడు గొప్పవాడని, నీచుడు అనే తేడాలేదు. చెదరని భక్తి అంతులేని ప్రేమ కలిగి ఉంటే భగవంతుణ్ణి చేరుకోగలము. భగవంతుని ప్రేమించే వారు ఆయన సృష్టిని ప్రేమిస్తారు. ఒక వ్యక్తిని ద్వేషించటమంటే పరమాత్మను ద్వేషించటమే. ఇది ప్రేమ బాట మినహాయింపులకూ పక్షపాతాలకు అక్కడ తావులేదు. ఎవరైతే నీచుడని లెక్కచెయ్యక శరీర వికారాలను చూడక సిగ్గుబిడియాలు వదిలి ఆశలు, తృష్ణలను ప్రేమాగ్నిలో కాల్చుతారో వారే పూర్ణమానవులు అవుతారు. మహాత్ములంతా ఈ బాటలోనే పయనించారు. మనం ఇతరులతో ప్రేమించబడటం కాదు. మనస్వభావమే ప్రేమ మయం కావాలి అప్పడే మనం అందరినీ ఆకర్షిస్తాము. ప్రేమిచటం ఎరుగని మానవుడు భగవంతుణ్ణి ఎన్నటికీ తెలుసుకోలేడు. ప్రేమ సహాయం చెయ్యమని ప్రేరణ చేస్తుంది. మనస్సు కొలతలు వేస్తూ వ్యాఖ్యానం చేస్తుంది. “మన జీవితం ప్రేమమయమై ఉండాలి, ద్వేషాలు, అసూయతలకు ఏ కోశానా చేటు ఇయ్యకూడదు. అప్పడు కాలం మనలను అనుసరించి తీరుతుంది సిద్ధులన్నీ మనలను సేవిస్తాయి” అన్నారు రామతీర్థ. మనకు అత్యంత సమీపంలో ఉన్న పరమాత్మ మీద ప్రేమ లేదు. దూరాన ఉన్న బంధుమిత్రులను విశ్వాస పాత్రులమని అనిపించుకోవటాన్కి ప్రయత్నం చేస్తాము. ఇదే మాయ. ప్రేమ అనే మాట వినగానే మనకు కామం. అజ్ఞానం మన మనస్సుకు ఆవహించే అపార్థ దశకు చేరుకొన్నాము. ప్రేమ అంటే సమత్వ బుద్ధి అన్నిట వాసుదేవుని దర్శించటమే. మనం గురువును స్మరించకుండా ఉండలేనప్పడు మనలను గురువు ప్రేమిస్తున్నాడని గ్రహించాలి అనే కొలబద్ధ. మనం చెడ్డ మనస్సుతో తీర్థయాత్రలకు పోయినా మన శరీరం ఒక భాగం స్నానమైనా రెండవ భాగమైన సూక్ష్మశరీరం మలినంగానే ఉంటుంది. చేదు దోశకాయను ఎన్ని నదుల్లో ముంచినా చేదు పోదు. ఇలాంటి స్నానాలు మహాత్ములకు అక్కరలేదు మలిన మనస్సుతో ఎన్ని స్నానాలు చేసినా దొంగ దొంగే. గాంధీజీ “ప్రేమ ఉన్నచోట భగవంతుడు ఉంటాడు. ప్రేమ ఎప్పడూ ఇతరులకు ఇయ్యలేదే అని బాధపడతుంది. కోపం తెచ్చుకోదు - ప్రతీకారం తీర్చుకోదు” అన్నారు. “విశ్వ ప్రేమకు బాహ్యరూపం అహింస” అంటారు. తోటి మానవులనే కాదు మనం పశుపక్షాదులను కూడా ప్రేమించాలి. ప్రేమలేని బ్రతుకు ఎడారి. ఎడారి జీవితంలో సుఖశాంతులు ఉండవు. ప్రేమ అనేది చెట్టు క్రింద ఉన్న చల్లని నీడలాంటిది. దాన్ని గురుకృపతో ఈ జన్మలోనే అనుభవంలోకి తెచ్చుకొని సుఖి అవ్వాలి.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం